

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ప్రథమ సంవత్సరం విద్యార్థులు 42,257 మంది, ద్వితీయ సంవత్సరం 40,744...
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరం 42,257 (22,464 బాలురు, 19,793 బాలికలు), ద్వితీయ సంవత్సరం 40,744 (21,464 బాలురు, 19,280 బాలికలు)...మొత్తం 83,001 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం 87 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి చేసిన ఏర్పాట్ల గురించి శుక్రవారం పిఠాపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బి.మురళీధర్ వివరించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. అంతేకాకుండా నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, 9 కస్టోడియన్ బృందాలను నియమించామన్నారు. పరీక్షల నిర్వహణ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమ న్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 0891 -2567561లో సంప్రతించాలని విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా ఎవరూ ఉండకూడదని తెలిపారు.

నేడు, రేపు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

- 2న జన్మభూమి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లు కూడా...

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ పరిధిలోని కడియం-ద్వారపూడి-అనపర్తి స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో జన్మభూమి, సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను తాత్కాలికంగా రద్దు చేశామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. మార్చి 1, 2 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 2, 3 తేదీల్లో విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240)ను రద్దు చేశారు. ఇక 2న విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805)లను, 3న లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806)ను రద్దు చేశామని పేర్కొన్నారు.

ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సంధ్యాదేవి

- పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు



నియామక ఉత్తర్వులు అందిస్తున్న బుచ్చిరాజు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గైనకాలజీ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవికి పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు ... మిగతా 6వ పేజీలో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.45 శాతం ఓటింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ప్రిసైడింగ్ అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం 92.45 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,794 మంది (92.45శాతం) ఓటు వేశారు. పురుషులు 13,508 మందికి 12,576మంది, మహిళలు 8,985కి 8,216 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు.

సంక్షేమ బడ్జెట్

అన్ని వర్గాలకూ కేటాయింపులు



- వచ్చే విద్యా సంవత్సరంలో 'తల్లికి వందనం'
- జిల్లాలో మూడు లక్షల మంది పిల్లలకు లబ్ధి
- మత్స్యకార భరోసా కింద అందిస్తున్న సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంపు
- నగరంలో 3,500 కుటుంబాలకు ప్రయోజనం
- ఆదరణ పథకం పునరుద్ధరణ
- కొత్తగా వృద్ధులకు ఆశ్రమాలు... విశాఖకు ఒకటి కేటాయించే అవకాశం
- ఐటీ రాయితీలకు రూ.300 కోట్లు...
- స్టార్టప్‌లకు రూ.51 కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పేదల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అన్ని వర్గాలకు మేలు జరిగేలా కేటాయింపులు చేసింది. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేసే విధంగా నిధులు సమకూర్చుకునే ప్రయత్నంలో ఉన్నట్టు వెల్లడించింది. గత ఏడాది ఆదాయం రూ.3 వేల కోట్లు అదనంగా రాగా ఈ ఏడాది రూ.48 వేల కోట్లకు పెరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది. గతంలో వృత్తిపని చేసుకునే వారికి అమలు చేసిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించింది. హామీల జాబితాలో లేనివి కూడా అందించడానికి ఆసక్తి చూపించింది.





మత్స్యకారులకు మేలు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో చాలామంది చేపల వేటపైనే జీవిస్తున్నారు. వేసవిలో 45 రోజులు సముద్రంలో వేటపై నిషేధం అమలు చేస్తారు. ఆ సమయంలో వారి జీవనానికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం 'మత్స్యకార భరోసా' అమలు చేస్తోంది. ఇప్పటివరకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు సాయం అందిస్తున్నారు. ఈ ఏడాది అంటే జూన్‌లోనే వారికి ఆ మొత్తం మరో రూ.10 వేలు పెంచి రూ.20వేలు చొప్పున అందిస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. దీనివల్ల ఒక్క విశాఖ నగరంలోనే 3,600 కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి.

ఏయూకు రూ.389.34 కోట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ల చెల్లింపునకు రూ.389.34 కోట్లను గ్రాంటుగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. గడిచిన మూడేళ్ల నుంచి అంతే మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయిస్తూ వస్తోంది. వర్సిటీలో సుమారు రెండు వేల మంది ఉద్యోగులు, 3,500 మంది వరకూ పెన్షనర్లు ఉన్నారు.



తల్లికి వందనం రూ.15 వేలు

ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున 'తల్లికి వందనం' పథకం కింద ఈ ఏడాది నుంచి ఇస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఇస్తామన్నారు. దీని వల్ల విశాఖపట్నం జిల్లాలో సుమారు మూడు లక్షల మంది పిల్లలు లబ్ధి పొందుతారు.

ప్రతి పేద కుటుంబానికి ఆరోగ్య బీమా

జిల్లాలో 5.3 లక్షల మంది తెల్లకార్డుదారులు ఉన్నారు. వారందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా అందించనున్నట్టు ప్రకటించింది. రూపాయి చెల్లించాల్సిన అవసరం లేకుండా నేరుగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం వైద్యం తీసుకునే అవకాశం లభించనుంది. దీనికి బీమా కంపెనీలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

వృద్ధాశ్రమాలు

రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కొత్త ఆలోచన చేసింది. వయస్సు పెరిగిన పెద్దలను పిల్లలు సరిగా ఆదరించకపోవడం, కొందరు రోడ్లపై ఆకలితో తిరుగుతుండడం గమనించి, వృద్ధుల కోసం రాష్ట్రంలో 12 వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తామని ... మిగతా 6వ పేజీలో

అందరి మేలు కోరే బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని అదే సమయంలో ప్రగతిని పరుగులు తీయించేలా చక్కటి బడ్జెట్ తెచ్చింది. ఒక్క తల్లికి వందనం పథకానికే రూ.9,407 కోట్లు కేటాయించారు. పోలవరానికి రూ.6,705 కోట్లు చూపించారు. సంక్షేమానికే లక్ష కోట్ల రూపాయలకుపైగా కేటాయించారు. ఇది అందరి మేలు కోరే బడ్జెట్.

- గంటా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కేటాయింపులు చేశారు. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించడం ద్వారా ఎన్నికల హామీలను నెరవేర్చనున్నాం. పోలవరానికి భారీగా నిధులు కేటాయించడం సంతోషకరం. అదేవిదంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.600 కోట్లు ఇచ్చారు.

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

సర్వతోముఖాభివృద్ధికి దోహదం



రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేవిధంగా బడ్జెట్ ఉంది. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయింపులు జరిపి ఎన్నికల హామీలను అమలు చేస్తున్నది. తల్లికి వందనం, రైతులకు పెట్టుబడి నిధుల కేటాయింపులు జరిగాయి. వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందనున్నాయి.

పంచకర్ల రమేశ్‌బాబు, జనసేన ఎమ్మెల్యే, పెందుర్తి

విశాఖకు నిధులేవి?



విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా చేస్తామని అనేక పర్యాయాలు హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. విశాఖలో మౌలిక వసతుల కల్పన, ఇతరత్రా అంశాలకు నిధులు లేవు. బడ్జెట్‌లో కేటాయింపుల్లో పక్షపాతం చూపారు. కేవలం అమరావతి ఒక్కటే ఆయన అజెండాగా చేసుకుని పనిచేస్తున్నారు.

- గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు

ఐటీ రాయితీ బకాయిలు వచ్చే అవకాశం



ఐటీ కంపెనీలకు రాయితీల కోసం రూ.300 కోట్లు కేటాయించారు. అయితే కనీసం ఏడాది పాటు కంపెనీ నడిపి ఉండాలనే నిబంధన ఉంది. దీనివల్ల ఈ ఏడాది వచ్చే దరఖాస్తులు తక్కువ ఉంటాయి. దీనివల్ల పాత రాయితీ బకాయిలు ఈ కేటాయింపుల నుంచి ఇచ్చే అవకాశం ఉంది. స్టార్టప్‌లకు బడ్జెట్ రూ.50 కోట్ల వరకు పెట్టారు. కనీసం రూ.100 కోట్లు పెట్టి ఉంటే బాగుండేది. అయితే ప్రతి శాఖలోను ఐటీ కోసం రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు బడ్జెట్ పెట్టారు. అది ఆహ్వానించదగిన పరిణామం.

- శ్రీధర్ కొసరాజు, పూర్వ ఛైర్మన్, ఐటాప్

సిటీలో విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్

- ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిపై పోలీస్ నిఘా
- హోటళ్లు, లాడ్జిల్లో దిగే వారి వివరాలు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా నిర్వాహకులకు సూచన
- పాత నేరస్థులు, అనుమానితులు ఉంటే వెంటనే అప్రమత్తమయ్యేందుకు అవకాశం
- తక్షణం అమలయ్యేలా చూడాల్సిందిగా పోలీస్ కమిషనర్ ఆదేశాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలపై సీపీ శంఖబ్రతబాగ్చి దృష్టిసారిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి హోటళ్లు, లాడ్జిల్లో బస చేసే వారిపై నిఘా పెంచాలని నిర్ణయించారు. అందుకోసం గతంలో అమలు చేసిన విజిటర్స్ మానటరింగ్ సిస్టమ్ (వీఎంఎస్)ను మళ్లీ పునఃప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.



సీపీ శంఖబ్రతబాగ్చి

పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్టార్ హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, చిన్న, పెద్ద లాడ్జిలు వెయ్యికిపైగా ఉన్నాయి. వీటిలో ప్రతిరోజూ 50 వేల మంది వరకూ బస చేస్తారని అంచనా. వారి వివరాలను ఒక రిజిస్టర్‌లో నమోదు చేయాలని నిర్వాహకులను పోలీసులు ఆదేశించారు. చాలా సంవత్సరాలుగా అదే పద్ధతి కొనసాగింది. పోలీసులు అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో పాత నేరస్థులు, అనుమానిత వ్యక్తులు, గంజాయి, ఇతర డ్రగ్స్ స్మగ్లర్లు వంటివారు కనిపిస్తే అదుపులోకి తీసుకుంటారు. నగరంలో ఏదైనా చోరీ లేదంటే ఇతర నేరాలు జరిగినప్పుడు ఆరోజు నగరంలోని హోటళ్లు, లాడ్జిల్లో బస చేసినవారి వివరాలను తెప్పించుకుని పరిశీలిస్తుంటారు. అయితే నేరస్థులు నగరం దాటిపోతుంటారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్‌గా సీహెచ్ శ్రీకాంత్ ఉన్నప్పుడు 'విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్ (వీఎంఎస్)'కు రూపకల్పన చేశారు. అందుకోసం ఒక ప్రత్యేక యాప్‌ను తయారుచేయించారు. నగరంలోని హోటళ్లు, లాడ్జిలు, గెస్ట్ హౌస్‌లకు యూజర్ ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌లో గాడి తప్పిన గైనకాలజీ వార్డు

విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం

- గర్భిణులు, బాలింతల బంధువుల నుంచి వసూళ్లు
- మగబిడ్డ పుడితే రూ.3 వేలు, ఆడ బిడ్డ అయితే రూ.1,500
- ఇవ్వకుంటే చుక్కలు చూపిస్తారు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇటీవల శిశువుల మార్పు
- విభాగం ప్రక్షాళనతోనే మెరుగైన సేవలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

కేజీహెచ్ గైనకాలజీ వార్డు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడమే గాకుండా...గర్భిణులు, బాలింతల బంధువుల నుంచి డబ్బులు వసూలు చేస్తుంటారు. సిబ్బంది తీరుపై పదేపదే ఫిర్యాదులు వస్తున్నా అధికారులు మాత్రం పట్టనట్టు ఊరుకుంటున్నారు. తాజాగా వార్డులో శిశువులు మారిపోవడం సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు.



కేజీహెచ్‌లోని గైనకాలజీ వార్డు

ఏం జరిగిందంటే...

అనకాపల్లి జిల్లా పరవాడ, కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు గర్భిణులు కొద్దిరోజుల కిందట గైనకాలజీ వార్డులో చేరారు. వీరిద్దరికీ నొప్పులు రావడంతో బుధవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ప్రసూతి విభాగంలోని లేబర్ రూమ్‌కు తీసుకువెళ్లారు. వేర్వేరుగా ట్యాగ్‌లు అమర్చారు. కృష్ణా జిల్లాకు చెందిన మహిళ పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉండడంతో 7.30 గంటలకు సిజేరియన్ చేశారు. ఆమెకు మగ బిడ్డ జన్మించాడు. శిశువును తల్లికి చూపించారు. ఫొటో కూడా తీశారు. అయితే శిశువును కృష్ణా జిల్లాకు చెందిన బాలింత కుటుంబ సభ్యులకు ఇవ్వాల్సి ఉండగా, నిర్లక్ష్యంతో పరవాడకు చెందిన గర్భిణి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ తరువాత కొద్ది నిమిషాలకు పరవాడకు చెం దిన మహిళకు ప్రసవం పూర్తయింది. ఆమెకు ఆడ బిడ్డ జన్మించింది. ఆడ శిశువును కృష్ణా జిల్లాకు చెందిన గర్భిణి కుటుంబ సభ్యులకు ... మిగతా 6వ పేజీలో

కిడ్నీ ఇప్పిస్తామంటూ లక్ష రూపాయలు కొట్టేసిన నకిలీ వైద్యులు!

మహారాణిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ ఇప్పిస్తామంటూ నకిలీ వైద్యులు లక్ష రూపాయలు తీసుకుని ఉడాయించారు. ఈ విషయమై బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం ఉప్పరపేట గ్రామానికి దూసి రాంజీకి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్న కుమారుడు మోక్షిత్ రామ్ (5) కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. చికిత్స కోసం అందినకాడికి రాంజీ అప్పులు చేశారు. బాలుడి ఆరోగ్యం మరింత క్షీణించడంతో కిడ్నీ మార్పిడి చికిత్సకు అవసరమైన సహాయం చేయాలని దాతలను కోరుతూ ఒక దినపత్రికలో ప్రకటన ఇచ్చారు. ఆ మరుసటిరోజు రాంజీకి ఒక ఫోన్ వచ్చింది. తాను కేజీహెచ్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నానని, తన పేరు నరసింహం అంటూ ఆ వ్యక్తి చెప్పాడు. కిడ్నీ ఏర్పాటుచేస్తానన్నాడు. బాలుడి తండ్రి రాంజీ వెంటనే కేజీహెచ్‌కు వెళ్లి ఫోన్ చేయగా...తన అసిస్టెంట్‌ను పంపిస్తున్నానని, అతడిని కలవాలని సూచించాడు. తెల్ల కోటు వేసుకున్న ఓ వ్యక్తి వచ్చి తన పేరు డాక్టర్ ప్రవీణ్‌గా పరిచయం చేసుకున్నాడు. రాంజీని కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయ ఆవరణ వద్దకు తీసుకువెళ్లి, అక్కడ నుంచి ఆస్పత్రిలోకి వెళ్లి వచ్చి సాయంత్రానికి లక్ష రూపాయలు సిద్ధం చేసుకోవాల్సిందిగా చెప్పాడు. కేజీహెచ్‌లోనే కిడ్నీ డోనర్ ఉన్నారన్నాడు. బాలుడి తల్లి తన ఒంటి మీద ఉన్న వస్తువులను అమ్మింది. మరుసటిరోజుకు లక్ష రూపాయలు ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి బియ్యం, పంచదార పంపిణీ

- వరుసగా రెండో నెల కూడా కందిపప్పు లేనట్టే...

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండో నెల కూడా బియ్యం కార్డుదారులకు కందిపప్పు సరఫరా విషయంలో పౌర సరఫరాల సంస్థ చేతులెత్తేసింది. మార్చి నెలకు సంబంధించి శనివారం నుంచి కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేయనున్నారు. కందిపప్పు రాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఈ ఏడాది జనవరి నెలలో కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేశారు. ఫిబ్రవరి నెలలో మిల్లర్లు కందిపప్పు సరఫరాను నిలిపివేశారు. మార్చి నెలలో కూడా సరకు ఇవ్వకపోవడంతో, బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేయనున్నారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లు శనివారం పంపిణీ చేయనున్నారు. మొత్తం 1,60,030 మంది కోసం రూ.69.7 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. నాలుగు గ్రామీణ మండలాల్లో 26,487 మందికి రూ.11.72 కోట్లు, జీవీఎంసీ పరిధిలో 1,33,543 మందికి రూ.58.58 కోట్లు గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి అందజేశారు. శనివారం ఉదయం ఏడు గంటల తరువాత పింఛన్ల పంపిణీకి అనువుగా యాప్ అందుబాటులోకి వస్తుందని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తెలిపారు.

ఐటీ కూడలి వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి

మధురవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మిథిలాపురి వుడా కాలనీ నుంచి ఐటీ హిల్‌కు వెళ్లే రహదారి కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. మానం ఆంజనేయనగర్ నుంచి బీచ్‌రోడ్డు, ఐటీహిల్‌కు వెళ్లే నాలుగు రోడ్ల కూడలి ప్రమాదకరంగా తయారైంది.ఈ రహదారిలో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఐటీ ఉద్యోగులు మూడు షిఫ్టుల్లో పని చేయడంతో వారు రాత్రి వేళల్లో కూడా ప్రయాణిస్తుంటారు. కొందరు తమ వాహనాలపై పరిమితికి మించిన వేగంతో వెళుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇదే రోడ్డులో ఐటీ ఉద్యోగినితో పాటు మరో వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. కొండపై నుంచి దిగువకు వస్తున్న వాహనాలు కూడా అతివేగం కారణంగా చోదకులు నియంత్రించలేక ప్రమాదాల బారిన పడి గాయపడుతున్నారు.

ఈ రహదారిలో పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు స్పీడ్‌గన్‌లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని అదుపు చేయించాలని పలువురు సూచిస్తున్నారు.

అలాగే మానం ఆంజనేయనగర్ కూడలి వద్ద ట్రాఫిక్ బీట్, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

నీడ లేదు.. తాగునీరు ఉండదు

» ఇదో సమస్యల సంత » వ్యాపారులు, కొనుగోలుదారులకు తప్పని ఇబ్బందులు

తగరపువలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస జాతీయ రహదారిని అనుకుని ఉన్న సంతలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. ఈ సంతకు మంచి ఆదరణ ఉంది. ఎటువంటి సదుపాయాలు లేకపోయినా నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతిరోజూ సంత జరుగుతున్నా ఆదివారం మాత్రం ప్రత్యేకం. దూర ప్రాంతాల నుంచి అమ్మకందారులు, కొనుగోలు దారులు పోటెత్తుతారు. వివిధ రకాల సరుకులతో వచ్చి క్రయవిక్రయాలు చేస్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ అవసరాల మేరకు కూరగాయల్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేసి తీసుకుని వెళుతుంటారు. విజయనగరం జిల్లా బోగాపురం పూసపాటిరేగ, డెంకాడ మండలాలలో వివిధ గ్రామాలతో పాటు విశాఖ జిల్లాలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల గ్రామాల నుంచి రైతులు ఈ సంతకు తమ సరుకులు తీసుకుని వస్తుంటారు. వీరితో పాటు రెగ్యులర్‌గా వ్యాపారాలు చేసేవారు కూడా ఈ సంతలో దుకాణాలు పెట్టుకుంటారు. అమ్మకందారులు తాము తీసుకొనిచ్చిన సరుకులు అమ్మగా, మిగిలిన సరుకు భద్రపరచడానికి ఇక్కడ అవకాశం లేదు. దీంతో మిగిలిన సరుకును వచ్చిన కాడికి అమ్ముకొని వెళతారు. అలాంటి పరస్థితి ఎదురైతే వీరికి నష్టమే వస్తుంది. కానీ, మరేం చేయలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పదకొండు గంటల వరకూ బేరాలు బాగానే ఉంటాయి. ఆ తర్వాత కొనుగోలుదారులు వివిధ ప్రాంతాల నుంచి సంతకు పోటెత్తడంతో అమ్మకందారులు తాము తెచ్చిన సరుకులు కూరగాయల ధరలు రేట్లు పెంచి వేస్తారు. అయినప్పటికీ వీరు తెచ్చిన సరుకు నాణ్యత బాగుండడంతో అమ్ముడుపోతుంది. ఈ సంతలో సాయంత్రం వరకు కూరగాయలు అమ్మకాలు సాగిస్తారు. వ్యాపారస్తులు, కొనుగోలుదారులకు తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, విశ్రాంతి సదుపాయాలు వంటివి లేనందున ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వపరంగా రైతుబజారు భవనాలను నిర్మించినా వాటిని ప్రారంభించకపోవడం, ప్రత్యామ్నాయం లేకపోవడంతో సంతనే నమ్ముకునే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ సంతో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, నీడ కల్పించాలని వ్యాపారులు, కొనుగోలుదారులు కొన్నేళ్ల నుంచి కోరుతూనే ఉన్నారు. కానీ పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతలో కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.


కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న సంత

సంక్షేమ బడ్జెట్

... 5వ పేజీ తరువాయి

ప్రకటించింది. విశాఖపట్నం అత్యంత ప్రధానమైన జిల్లా కాబట్టి ఇక్కడ కూడా ఒకటి వస్తుంది. వృద్ధులకు ఇది ఆసరాగా నిలుస్తుంది.

ఐటీ కంపెనీలకు రాయితీలు

ఐటీ కంపెనీలకు రాయితీలుగా అందించేందుకు బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించారు. గతంలో బకాయిలు కొన్ని రావలసి ఉంది. వాటిలో 50 శాతం వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసే అవకాశం ఉందని ఐటీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.50 కోట్లు కేటాయించారు. ఇది యువ ఇంజనీర్లకు మంచి అవకాశం అని ఐటీ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు

ప్రభుత్వ పాఠశాలలకు మేలు చేసే నిర్ణయం బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యుత్ బిల్లును ప్రభుత్వమే భరిస్తుందని, ఆ భారం తగ్గించేస్తామని వెల్లడించింది. విశాఖ జిల్లాలో 586 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల స్థాయిని బట్టి ప్రాథమిక పాఠశాల అయితే నెలకు సగటున రూ.500, ఉన్నత పాఠశాల రూ.2,500 వరకు బిల్లు వస్తుంది. ఆ భారం ఇక తప్పినట్టే. కొన్ని పాఠశాలలకు లక్ష రూపాయల బకాయిలు ఉన్నాయి. వాటిని కూడా రద్దు చేసే అవకాశం ఉంది.

పర్యాటకానికి భారీ నిధులు

రాష్ట్రంలో పర్యాటకం, యూత్, క్రీడలకు కలిపి రూ.469 కోట్ల బడ్జెట్ కేటాయించారు. గతంతో పోల్చుకుంటే ఇది భారీ బడ్జెట్. అంటే రాష్ట్రంలో పర్యాటకాన్ని, క్రీడలను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ నిధులు ప్రకటించింది. విశాఖ జిల్లాలో నిధులు లేక ఆగిపోయిన హరిత (అప్పుఘర్) వంటి అనేక ప్రాజెక్టులు ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తయ్యే అవకాశం ఉంది.

ఆశించిన ఆదాయం వస్తే ఆర్థికంగా మేలు



- నరేశ్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్.

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో రూ.48 వేల కోట్ల ఆదాయం పెరుగుతుందని అంచనాలు చూపించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది బాగా అధికం. అంచనాలను అందుకుంటే ఆర్థిక పరిస్థితి మెరుగై యువతకు ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



- ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, రిటైర్డ్ ఎకనామిక్స్ విభాగాధిపతి

అభివృద్ధి, సంక్షేమానికి సమానంగా ప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో స్థిరత్వాన్ని సాధించేందుకు అనుగుణంగా కీలక శాఖలకు నిధులను కేటాయించారు. విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపించింది. గడిచిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు భారీగానే నిధులు కేటాయించారు. 2047 లక్ష్యాలను సాధించేందుకు అభివృద్ధి నిధులను కొంత పెంచి ఉంటే బాగుండేది. గ్రోత్ రేటు ప్రస్తుతం 13 శాతంగా ఉంది. వచ్చే ఏడాది నుంచి 15 శాతం లక్ష్యంగా చేసుకుని ప్రణాళికలు వేయాలి. అప్పుడే విజన్-2047 లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంది.

బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం



బీసీల సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు హర్షణీయం. సూపర్ సిక్స్ పథకాలకు నిధులిచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించి చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారు.

- గండి బాబ్జీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

సంక్షేమ రంగానికి ప్రాధాన్యం



బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20 వేలు అందుతాయి. తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు అమ్మఒడికి చెంపదెబ్బ ప్రతీ కుటుంబానికి ఆరోగ్య బీమాతో ఎంతో మేలు. మత్స్యకారుల సాయం 20 వేలకు పెంపుతో వారికి లబ్ధి. ఆదరణ పథకం పునఃప్రారంభించి నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు.

- సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణ ఎమ్మెల్యే

'సూపర్ సిక్స్'కు కేటాయింపులేవీ?



సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. తల్లికి వందనం పథకం కింద ఎందరు పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించినా ఆశించిన స్థాయిలో నిధులేవీ. విద్య, వైద్యానికి మెరుగైన కేటాయింపులున్నాయి. వ్యవసాయ రంగానికి అధికంగా నిధులిస్తే బాగుండేది. బడ్జెట్ అంకెల గారడీ. కూటమి ప్రభుత్వం కీలక రంగాలను విస్మరించినట్టు కనిపిస్తోంది.

- వజ్జపర్తి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

నూకాలమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సంపూర్ణ సహకారం అందిస్తాం : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భీమిలి గ్రామదేవత శ్రీనూకాలమ్మ ఉత్సవాల నిర్వహణకు తన సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూకాలమ్మ ఉత్సవ కమిటీ-2025 అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు మాట్లాడుతూ మార్చి 27 నుంచి 30వ తేదీ వరకూ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వై.హరి, కోశాధికారి పి.ఎర్రయ్యరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.వినోద్‌కుమార్, కో-ఆర్డినేటర్ జి.సన్యాసిరావు, పట్టణ ప్రముఖులు గంటా నూకరాజు, అప్పలనాయుడు, అనిల్ ప్రసాద్, నరేంద్రకుమార్, షణ్ముఖరావు పాల్గొన్నారు.


నూకాలమ్మ ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు

జీవీఎంసీ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

సిరిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతీ ఉద్యోగికి తప్పనిసరని, ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది లాంటిదని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న 31 మంది జీవీఎంసీ అధికారులను, ఉద్యోగులను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మతో కలిసి శుక్రవారం సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవీఎంసీలో సుదీర్ఘకాలం ప్రజల కోసం ఎన్నో సేవలు అందించారని, రోజులో తన కుటుంబం కంటే తమ సంస్థ కోసం అంకితమై సేవలు అందించి, ఉద్యోగ విరమణ పొందిన ప్రతీ ఉద్యోగి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.నగర పరిశుభ్రతను చూసి ఆనందపడితే ఆ ఘనత పారిశుధ్య కార్మికులకే దక్కుతుందన్నారు.పర్యవేక్షక ఇంజనీర్ కే.శాంసన్‌రాజుతో పాటు వివిధ హోదాలలో నిచేసిన 31 మంది ఉద్యోగులను అదనపు కమిషనర్లు వస్త్రాలు బహూకరించి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు.

ఏఐ రాకతో మేధోహక్కులపై సునిశిత సమీక్ష అవసరం

గీతం అంతర్జాతీయ సదస్సులో న్యాయనిపుణులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం అన్ని రంగాల్లో పెరుగుతున్న నేపథ్యంలో మేధోహక్కుల విషయంలోసునిశిత సమీక్ష అవసరమని, అలాగే నైతిక అంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతోందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా, ఎక్విటస్ విక్టోరియా రీసెర్చి సెంటర్ (వీహెర్) సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు. అసోంలోని జాతీయ న్యాయవిశ్వవిద్యాలయ, జ్యుడీషియల్ అకాడమీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కేవీఎస్ శర్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి సదస్సును ప్రారంభించారు. నూతన ఆవిష్కరణలకు సంబంధించి మేధోహక్కులు ఎవరికి చెందుతాయనే అంశంపై మాట్లాడుతూ ఏఐ రాకతో ఐపీఆర్ చట్టాలు సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. గీతం ప్రో వైస్ ఛాన్సలర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ పరిశోధన, సిద్ధాంత వ్యాసాలను సమర్పించడంలో కృత్రిమ మేధను ఒక మాధ్యమంగా ఉపయోగించుకోవడం పెరుగుతోందని, అదే సమయంలో అసలైన మేధోహక్కులకు భంగం కలగకుండా ప్రత్యామ్నాయం చూడాలన్నారు. ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం న్యాయకళాశాల డీన్ ప్రొఫెసర్ శ్రీసుధ మాట్లాడుతూ వివిధ పరిశ్రమలు, విద్యారంగంలో కృత్రిమ మేధ వాడకం వల్ల సరికొత్త వివాదాలు తలెత్తుతున్నాయన్నారు గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ కృత్రిమ మేధను ఉపయోగించేవారు నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

ప్రభుత్వ స్థలంలో మేకలసంతను అడ్డుకోండి

కొమ్మాది, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మారికవలస ఓజోన్‌వ్యాలీ సమీపంలోని సేవానగర్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో కొంతమంది వ్యక్తులు అనధికారికంగా గొర్రెలు, మేకల సంత నిర్వహిస్తున్నారని వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలంలో మేకలసంతను అడ్డుకోవాలని సేవానగర్ వాసులు కోరుతున్నారు. సంత నిర్వహిస్తున్న స్థలానికి సంబంధించి 2007లో డీపట్టా రద్దుచేసి వీఎంఆర్డీఏకు రెవెన్యూ శాఖ అప్పగించిందని, అది ప్రభుత్వ స్థలమని తెలిసినా అధికారులు స్పందించడం లేదని అధికారులకు పిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సంధ్యాదేవి

... 5వ పేజీ తరువాయి

అప్పగిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాలో ఆమె ముందున్నారు. అందుకు అనుగుణంగానే ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు శుక్రవారం పదవీ విరమణ పొందారు.

ఆయన స్థానంలో సంధ్యాదేవి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమెకు నియామక ఉత్తర్వులను శుక్రవారం సాయంత్రం డాక్టర్ బుచ్చిరాజు అందజేశారు.

వేలం ద్వారా అప్పన్నకు రూ.65.83 లక్షల ఆదాయం

సింహాచలం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలోని తోటల ఫలసాయాన్ని ప్రస్తుత పంటకాలానికి రానున్న జూలై వరకు అనుభవించే హక్కుకు, సింహగిరిపై భక్తులకు కొబ్బరికాయలు, పూజా సామగ్రి, తదితరాలు విక్రయించేందుకు నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఖజానాకు రూ.65.83 లక్షల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు ఆదేశాల మేరకు శుక్రవారం కొండదిగువ ఈవో కార్యాయలంలో దేవదాయశాఖ అధికారి శ్రీధర్ పర్యవేక్షణలో టెండర్ కమ్ వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారులు నక్కాన ఆనందకుమార్, వీబీ రమణమూర్తి, పర్యవేక్షణాధికారి ప్రసన్నలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత నిత్య కల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం సింహాద్రి అప్పన్నకు నేత్రపర్వంగా ఆర్జిత నిత్యకల్యాణం జరిపారు. దీనిలో భాగంగా ప్రభాత సేవలు, సహస్రనామ తులసీ దళార్చనల తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో రజిత ఆసనంపై ఉంచి వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపారు.


కల్యాణం చేస్తున్న వైదికులు

ఉచితంగా కోడి పకోడి, గుడ్లు పంపిణీ

- సాగర్‌నగర్ తాటిచెట్లపాలెం కూడలిలో బారులు తీరిన జనం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చికెన్ దుకాణం వద్ద కోడిగుడ్లు, చికెన్ పకోడి ఉచితంగా పంపిణీ చేయడంతో సాగర్‌నగర్ సమీపంలోని తాటిచెట్లపాలెం కూడలిలో ఉన్న చికెన్ అండ్ స్నాక్ పాయింట్ వద్ద శుక్రవారం జనం బారులు తీరారు. బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శ్రీవేంకటేశ్వర హేచరీస్, శ్రీనివాస చికెన్ అండ్ స్నాక్ పాయింట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత చికెన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కోడిమాంసాన్ని వండుకుని తినడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చికెన్ పకోడి, ఉడకపెట్టిన కోడిగుడ్లు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. స్నాక్స్ రూపంలో సుమారు 500 కిలోల చికెన్, రెండు వేలకు పైగా గుడ్లు అందించినట్టు నిర్వాహకుడు బేవర మార్కండేయులు తెలిపారు.


కోడి పకోడి కోసం బారులు తీరిన జనం

సెలవులో సింహాచలం దేవస్థానం ఈవో

రాజమహేంద్రవరం డిప్యూటీ కలెక్టర్‌కు ఈవోగా అదనపు బాధ్యతలు

సింహాచలం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు వ్యక్తిగత పనులపై యూఎస్ వెళుతున్న కారణంగా రాష్ట్ర దేవదాయశాఖ మూడు నెలలపాటు ఆయనకు సెలవు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మార్చి 1 నుంచి మే 31 వరకు సెలవు మంజూరు చేస్తున్నట్టు ఉత్వర్వుల్లో పేర్కొంది. కాగా రాజమహేంద్రవరం డిప్యూటీ కలెక్టర్, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషన్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సుబ్బారావుకు ఈ మూడు నెలల పాటు దేవస్థానం ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఆ ఉత్వర్వుల్లో పేర్కొంది.

ఘనంగా తిరువీధి ఉత్సవం

సింహాచలం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో అమావాస్యను పురస్కరించుకుని స్వామివారికి తిరువీధోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకుల సమక్షంలో ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా స్థానాచార్యులు, నాలాయిర దివ్య ప్రబంధం అధ్యాపకులు దివ్య ప్రబంధాన్ని మధురంగా ఆలపించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి0: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో శాంతిస్వరూప్‌భట్నాగర్ అవార్డు గ్రహీతలు ప్రొఫెసర్ రాఘవేంద్రగడాగ్‌కర్, ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ హాజరై సర్ సీవీ రామన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న ప్రస్తుత కాలంలో వివిధ విభాగాల మధ్య సంయుక్త అధ్యయనాలు అవసరమన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయడంలో వెనకడుగు వేయరాదన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ పరిశోధనలు జరపడానికి పెద్ద ప్రయోగశాలలు, నిధులు అవసరం లేదని సర్ సి.వి.రామన్ నిరూపించారని తెలిపారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎథోలజిస్ట్స్ అంతర్జాతీయ కార్యదర్శి ప్రొఫెసర్ రాఘవేంద్రగడాగ్‌కర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలకు, ప్రజలకు మధ్య ఉన్న దూరం తగ్గాలని, ప్రజలకు అర్థమయ్యే విధంగా శాస్త్ర ఫలితాలను వివరించాలన్నారు. ప్రశ్నించే తత్వం వల్ల సైన్స్‌లో ఎదగడానికి మార్గం ఏర్పడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.వేదవతి, వివిధ విభాగాల అధిపతులు, శాస్త్రవేత్తలు, సీనియర్ ప్రొఫెసర్‌లు ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గీతం వర్సిటీలో ప్రొఫెసర్ రాఘవేంద్రగడాగ్‌కర్‌కు జ్ఞాపిక అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

తాటితూరు ఎంపీపీ స్కూల్‌లో..

భీమునిపట్నం (రూరల్): భీమిలి మండలం తాటితూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

తగరపువలస: తగరపువలస బాసర జూనియర్ డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఇందులో 34 రకాల ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ పూడి రమేశ్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రేఖ, డీన్ ఎం.భాస్కరరావు ప్రధానోపాధ్యాయుడు కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపాలెంలో..

మధురవాడ: పీఎంపాలెం క్రికెట్ స్టేడియం సమీపంలోని మాలతాంబ విద్యానికేతన్ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్‌మహంతి, పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

భైరవస్వామికి మొక్కులు చెల్లింపు

సింహాచలం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధాలయంగా అడివివరం గ్రామానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరాన అటవీ మార్గాన కొలువుదీరిన భైరవస్వామికి పెద్ద సంఖ్యలో భక్తులు అమావాస్య మొక్కులు చెల్లించుకున్నారు. మాఘమాస బహుళపక్ష అమావాస్య కావడంతో శుక్రవారం వేకువజాము నుంచే ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశాకు చెందిన భక్తులు భైరవుని దర్శనానికి తరలి వచ్చారు. సింహాచల దేవస్థానం పూర్వపు ఈవో, ప్రస్తుత విజయనగరం జిల్లా ఆర్డీవో సూర్యకళ గురువారం అర్ధరాత్రి పన్నెండు గంటలకు ఆలయానికి చేరుకుని స్వామికి మొక్కులు చెల్లించారు. అదే విధంగా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకు పలువురు భక్తులు భైరవస్వామిని దర్శించుకుని పంచామృతాలతో, ప్రధానంగా క్షీరంతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వడమాలలు కంఠాన అలంకరించారు.


భైరవస్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

కార్మిక నాయకుడు అల్లు బాబూరావు మృతి

తగరపువలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస జూట్‌మిల్లు కార్మిక నాయకునిగా కొనసాగుతున్న అల్లు బాబూరావు(65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన జూట్ ఉద్యమంలో కీలకంగా ఉన్న ఏఐటీయూసీలో ప్రధాన బాధ్యునిగా ఉండడంతో పాటు సీపీఐ ఏరియా కమిటీ కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతికి సీపీఐ నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల అప్పలసూరి, తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.


బాబూరావు(ఫైల్)

అప్పన్నకు తులసీదళార్చన

సింహాచలం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి సంప్రదాయబద్ధంగా సహస్రనామ తులసీ దళార్చన నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. నారసింహ సహస్రనామావళి పఠిస్తూ ప్రతినామానికి పవిత్ర తులసీ దళాలతో అర్చకులు పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కిడ్నీ ఇప్పిస్తామంటూ రూ.లక్ష కొట్టేసిన నకిలీ వైద్యులు!

... 5వ పేజీ తరువాయి

తీసుకువెళ్లారు. నరసింహానికి ఫోన్ చేయగా ఆ డబ్బును పిల్లల వార్డు వద్ద ఉన్న తన కారు డ్రైవర్‌కు ఇవ్వాలని చెప్పాడు. రాంజీ వాళ్లు చెప్పిన విధంగానే డబ్బును ఇచ్చేశాడు. డబ్బులు తీసుకున్నప్పటి నుంచి ముగ్గురి జాడ లేదు.

సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో కేజీహెచ్‌లో సంబంధిత విభాగాలలో వైద్యులను సంప్రతించగా అటువంటివారు ఎవరూ లేరని తెలిపారు. దీంతో తమ నుంచి లక్ష రూపాయలు కాజేసింది నకిలీ డాక్టర్లుగా గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.

సిటీలో విజిటర్స్ మానటరింగ్ సిస్టమ్

... 5వ పేజీ తరువాయి

ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించారు. తమ హోటళ్లలో దిగేవారి వివరాలను వెంటనే వారికి కేటాయించిన లాగిన్ ద్వారా యాప్‌లో నమోదుచేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఏ హోటల్/లాడ్జిలో ఎవరు ఎప్పుడు చెక్ ఇన్ అయ్యారు, ఎప్పుడు చెక్ అవుట్ అయ్యారనేది పోలీసులకు ఎప్పటికప్పుడు తెలుస్తుండేది. హోటల్/లాడ్జిల్లో చెకి ఇన్ అయినవారిలో ఎవరైనా అనుమానితులు, పాత నేరస్థులు ఉన్నట్టయితే వెంటనే అక్కడకు వెళ్లి వారు నగరానికి ఎందుకువచ్చారు?, ఎక్కడకు వెళతారనే వివరాలను సేకరించేవారు. ఏదైనా తేడాగా అనిపిస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకోవడం ద్వారా నేరం జరగకుండా ముందుగానే అడ్డుకునేందుకు అవకాశం ఉండేది.అయితే శ్రీకాంత్ తర్వాత వచ్చిన సీపీలు నిర్లక్ష్యం చేయడంతో వీఎంఎస్ మరుగునపడిపోయింది. తాజాగా సీపీ శంఖబ్రతబాగ్చి నగరంలో నేరాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదే సమయంలో వీఎంఎస్‌ను తిరిగి అమలు చేయడం వల్ల మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చునని భావించారు. దీంతో ప్రతి హోటల్/లాడ్జికు వచ్చే వారి వివరాలను ఎప్పటికప్పుడు అందులో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ విభాగం పోలీసులు వీఎంఎస్‌ను పునరుద్ధరించే పనులపై దృష్టిసారించారు.

కేజీహెచ్‌లో గాడితప్పిన గైనకాలజీ వార్డు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. మగ బిడ్డ పుట్టినట్టు చెప్పిన సిబ్బంది ఆడ శిశువును చేతిలో పెట్టడంతో కృష్ణా జిల్లాకు చెందిన మహిళ కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారంతా బయటకు వచ్చి ఆందోళనకు సిద్ధమయ్యారు. దీంతో సూపరింటెండెంట్ వచ్చి సీసీ కెమెరాలు, ఫొటోలను చూపించి ఇరు వర్గాలను ఒప్పించి ఎవరి బిడ్డను వారికి అప్పగించారు. అయితే, ఇది పొరపాటున జరిగిందా?, ఇంకేమైనా కారణాలు ఉన్నాయా?...అన్న దానిపై విచారణ జరిపేందుకు సూపరింటెండెంట్ కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ వాసవీ లత, డాక్టర్ సంధ్యాదేవి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మలతో కమిటీ ఏర్పాటుచేశారు. ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించనుంది.

ఇప్పటికీ వసూళ్ల పర్వం

ఈ విభాగంలో సిబ్బంది అబ్బాయి పుడితే రూ.3 వేలు, అమ్మాయి పుడితే వేయి నుంచి రూ.1500 వరకూ వసూలు చేస్తుంటారు. ఈ మొత్తాన్ని లేబర్ రూమ్‌లో పనిచేసే సిబ్బంది పంచుకుంటారు. ఆర్థికంగా ఎవరైనా ఇవ్వలేని స్థితిలో ఉంటే చుక్కలు చూపిస్తారు. వసూళ్లపై అధికారులకు ఎంతోమంది బాధితులు ఫిర్యాదుచేశారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక గర్భిణులు, బాలింతలు, వారి బంధువులు పట్ల ఆయాలు, వార్డు బాయ్‌లు వ్యవహరించే తీరు అత్యంత దారుణంగా ఉంటుంది. ఇష్టానుసారంగా మాట్లాడుతుంటారు. ఇప్పటికైనా ఈ విభాగం ప్రక్షాళనపై అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

నూతన ఆవిష్కరణలకు సైన్సు కీలకం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ శ్రీరామకృష్ణ

పలు విద్యాసంస్థల్లో విజ్ఞానదాయకంగా సైన్స్ డే

మద్దిలపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవడం, నూతన ఆవిష్కరణను చేపట్టడానికి సైన్స్‌దే కీలకపాత్ర అని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ శ్రీరామకృష్ణ చెప్పారు. వీఎస్ కృష్ణా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో ఆయన మాటాడుతూ ప్రజల దైనందిన జీవితంలో సైన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అందుకే భారత భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ 1928 ఫిబ్రవరి, 28న రామన్ ప్రభావాన్ని కనుగొన్నందుకు గుర్తుగా ప్రతీ ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. భారత ప్రభుత్వం 1999 నుంచి ప్రతీ ఏడాది కొత్త థీమ్‌తో సైన్స్ ప్రాముఖ్యతను వ్యాప్తి చేస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది వికసిత్ భారత్ కోసం సైన్స్ అండ్ ఇన్నోవేషన్‌లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారిత కల్పించడం థీమ్‌తో ముందుకు వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు కె.రవిబాబు, శ్రావణ్‌కుమార్, రాజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్బుర పరిచిన చిన్నారుల సిక్స్త్ సెన్స్

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన ఓ ప్రదర్శనలో చిన్నారుల సిక్స్త్ సెన్స్ ప్రదర్శన అబ్బుర పరిచింది. ఉషోదయ కూడలిలోని కిడ్జ్ గార్డెన్ స్కూలులో శుక్రవారం జ్ఞానోత్సవం-2025 పేరిట నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. ముఖ్యంగా సిక్స్త్ సెన్స్ పేరిట నిర్వహించిన విద్యార్థుల మేధ ఆశ్చర్యపరిచింది. మానవ మేధాశక్తిని చూపింది. ఏయూ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులను పరీక్షించారు. కళ్లకు గంతలు కట్టుకుని, ఎదురుగా ఉన్న వస్తువును కనీసం తాకకుండా గుర్తుపట్టడం, ఒకసారి చెప్పిన పేర్లను వరుస క్రమంలోనే కాకుండా అంకె చెపితే ఆ పదాన్ని చెప్పేయడం, మొబైల్ ఫోన్‌లో ఫొటో సైతం గుర్తు పట్టి చెప్పడం వంటివి విద్యార్థులు ప్రదర్శించారు. సాంకేతికత ఉపయోగించి చేసేఅద్భుతాలను విద్యార్థులు తమ ప్రదర్శనలో నమూనాలుగా ఉంచారు. ప్రిన్సిపాల్ సాయిలక్ష్మీ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ఎంవీపీ కాలనీ : సైన్స్ ఎగ్జిబిషన్‌లో వివిధ నమూనాలు ప్రదర్శించిన విద్యారులు



ఎంవీపీ కాలనీ : చిన్నారుల సిక్స్త్ సెన్స్‌ను పరీక్షిస్తున్న ఆచార్య ఈశ్వర్ కుమార్

గాయత్రీ కళాశాలలో సైన్స్ డే

ఎంవీపీ కాలనీలోని గాయత్రీ విద్యాపరిషత్‌లో శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ విభాగంలోని పలువురు అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు. 'ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ వికసిత్ భారత్' అనే లక్ష్యంతో సైన్స్ డే నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఆచార్య కేయస్ బోస్ పేర్కొన్నారు. యూజీ కోర్సుల డైరెక్టర్ గిరిధర్, ఆచార్య డి.దక్షిణామూర్తి, ఆచార్య ప్రగడ రాజ గణపతి, ఆచార్య వీఎస్సార్‌ప్రసాద్, డీవీఎస్ కామేశ్వరరావు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ కుంభమేళాలో శాస్త్రీయ సాంకేతిక నైపుణ్యాలను వివరించారు. శాస్త్ర విషయాలను చర్చిస్తూ.. ఆలోచన శక్తికి పదును పెట్టి నేటి యువత అద్భుత ఆవిష్కరణలు సాధించాలని కోరారు. మిసెస్ ఏవీఎన్ కళాశాల, సమతా కాలేజీ, ప్రిజమ్ కళాశాల, సెయింట్ జోసఫ్ కళాశాలల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మైండ్ గేమ్స్, పజిల్‌సాల్వింగ్, స్మార్ట్ క్విజ్ వంటివి నిర్వహించారు.

స్టీల్‌ప్లాంటు ఎస్‌ఎంఎస్ విభాగంలో పేలుడు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులోని స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్‌ఎంఎస్)-1 విభాగంలో శుక్రవారం పేలుడు సంభవించింది. విభాగం ఉద్యోగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా ద్రవపు ఉక్కును సీసీడీ (కంటిన్యూ కాస్టింగ్ డిపార్టుమెంట్)కు పంపే క్రమంలో తయారయ్యే స్లాగ్‌ను పాట్ ద్వారా యార్డ్ పిట్ (స్లాగ్ నిల్వ ఉంచే ప్రదేశం)కు తరలించారు. ఆ సమయంలో పిట్‌లో కొద్దిపాటి నీరుండడంతో స్లాగ్ వేడికి పేలుడు సంభవించింది. పేలుడుకు పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి.ఈ సమయంలో ఉద్యోగులు పనులు ముగించుకొని వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం వల్ల ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగలేదని యాజమాన్యం ప్రకటించింది.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న కాలభైరవ స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి మకర తోరణమును అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రకాశ్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, భాస్కర్‌శర్మల ఆధ్వర్యంలో భక్తుల పేరిట అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ వెంకట రమణారెడ్డి, ఎస్.సత్యారావు, బోర ఎర్రాజీరెడ్డి,ఎస్.నరసింహారెడ్డి పాల్గొన్నారు

దర్జీలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : దర్జీలు సాంకేతికతను అందిపుచ్చుకుని, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలని 18వ వార్డు వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ టైలర్స్ డే సందర్భంగా శివాజీపార్కులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రెడీ మేడ్ దుస్తుల మార్కెట్ టైలర్ల వ్యాపారాన్ని బాగా దెబ్బతీసిందన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ కొందరు టైలర్లు తమ వృత్తిలో రాణించడం గొప్పవిషయమని అన్నారు. కొత్త పోకడలను అందిపుచ్చుకోవడం ద్వారా కొంతమేర పోటీని తట్టుకుని ముందుకు వెళ్లవచ్చన్నారు. టైలర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి టైలర్లు పాల్గొన్నారు.

వాక్పటిమ హనుమంతుడి సొంతం

» ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు » ముగిసిన ప్రవచనాల కార్యక్రమం

కొమ్మాది, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడు, ఎవరితో ఎంత ఎలా మాట్లాడాలో బాగా తెలిసిన వాగ్వైభావం కలిగిన మహానుభావుడు హనుమంతుడు అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మాదిలోని గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా శుక్రవారం సుందరకాండలోని ఆఖరిఘట్టం వివరించారు. సీతమ్మ దర్శనం చేసుకుని వెనుకకు వచ్చిన హనుమను చూసి వానరులంతా ఎంతో సంతోషించారని, జాంబవంతుడు హనుమను సీతాన్వేషణ జరిపిన విధమును తెలపమని అడిగాడని, అప్పుడు హనుమ తాను సముద్రాన్ని దాటటం, సీతాన్వేషణ చేయటం, సీతమ్మను దర్శించుకోవడం, రావణుడి సైన్యంతో భీమ విక్రమంతో యుద్ధం చేయడం, రావణదర్శనం, లంకాదహనం ఘటనలు విపులంగా వివరించారు. జరిగినదంతా విన్న అంగదుడు వెంటనే అక్కడ ఉన్న వనరులతో లంకకు వెళ్లి మిగిలిన రాక్షసులను చంపి సీతను తీసుకువద్దామని తెలుపగా, జాంబవంతుడు వారించి సుగ్రీవుడు చెప్పిన పనిని మాత్రమే చేయాలని, అందువల్ల ఈ విషయాన్ని సుగ్రీవుడికి నివేదిద్దామని తెలిపి వానరులంతా సుగ్రీవుని వద్దకు బయలుదేరిన సంఘటను వివరించారు. సుందరకాండ ప్రవచనాలు పూర్తి అయిన సందర్భంగా వేద పండితులు భక్తితత్పరులు ద్వాదశి ఉమామహేశ్వరం దంపతులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు తదితరులు పాల్గొన్నారు



చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న అతిథులు

డాక్టర్ బుచ్చిరాజుకు ఘనంగా వీడ్కోలు



డాక్టర్ బుచ్చిబాబును సన్మానిస్తున్న వైద్యులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన జి.బుచ్చిరాజుకు వివిధ విభాగాల ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. మెడికల్ కాలేజీలోని సెమినార్‌హాల్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ తాను ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న సమయంలోనే మెడికల్ కాలేజీ వందేళ్ల వేడుకలు జరగడం గర్వంగా ఉందన్నారు. కాలేజీ ప్రతిష్ఠను పెంచేందుకు అంకితభావంతో కృషిచేశానన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ మన్మథరావు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సంతృప్తితో వెళుతున్నా..

వైద్య వృత్తి పవిత్రమైనదని, ఇన్నేళ్లలో ఎంతోమందికి సేవ చేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉందని డాక్టర్ ధవళ భాస్కరరావు పేర్కొన్నారు. కేజీహెచ్ ఆర్‌ఎంవోగా పనిచేసిన ఆయన ఆయన శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా అతనిని కేజీహెచ్ వైద్యులు సత్కరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మాట్లాడుతూ కేజీహెచ్ అభివృద్ధిలో భాస్కరరావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ వాసవీ లత, డాక్టర్ రాధాకృష్ణ, డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్, ఏఆర్‌ఎంవో డాక్టర్ రాజేష్, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, కేజీహెచ్ ఏడీ సుమతి, విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసకుమార్, మేనేజర్ సత్యనారాయణ, ఎంఆర్‌వో పీఎం జవహర్‌లాల్, అకౌంటెంట్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస పరిసర ప్రాంతాలలో టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న టైలర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారంసాయంత్రం చిట్టివలస జూట్‌మిల్లు సంక్షేమ భవనంలో జరిగిన టైలర్ల సంఘ సమావేశానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నిరుపేద టైలర్లకు ఆధునిక కుట్టుమిషన్ల కొనుగోలుకు రుణాలు అందించడం, ఇంటి స్థలాలు కేటాయించడం వంటిచర్యలు తీసుకుంటామన్నారు. రెడీమేడ్ వస్త్రాల వినియోగం పెరిగిపోయిన తర్వాత చాలామంది ఈ వృత్తి నుంచి విరమిస్తున్నారని, వీరి ఉపాధి కోసం ప్రభుత్వపరంగా దుస్తులు కుట్టే పనులను అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ఈ సమావేశానికి టైలర్ల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముందుగా తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ టైలర్లు చిట్టివలస నుంచి తగరపువలస వరకు ప్రదర్శన చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కొప్పల రమేష్, కో-ఆప్షన్ కార్పొరేటర్ కొప్పల ప్రభావతి, పద్మశాలీ సేవా సంఘం కార్యదర్శి కోసూరి మురళీ తదితరులు మాట్లాడారు. ఆయన పదిమంది టైలర్లకు కత్తెర్లను ఎమ్మెల్యే ద్వారా అందించారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్ జోగ వెంకటరావును ఇతర టైలర్లు సన్మానించారు. ఎల్లమాంబ టైలర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కార్యదర్శి చింతల సురేష్ నిర్వహించారు.



టైలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ గంటా శ్రీనివాసరావు

సినిమా గైడ్

● **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
● **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
● **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
● **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 13, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 42, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 36, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 26, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 46, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180

ప్రమాదాల నియంత్రణపై అవగాహన ఉండాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సిరిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలు, ప్రమాదాల నియంత్రణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎన్ఐఎఫ్ఎస్ జీఎం ఆపరేషన్స్ కుసుమకుమారి పేర్కొన్నారు. 54వ జాతీయ భద్రతా దినోత్సవనం సందర్భంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమెతో పాటు సీఈఓ సునీల్ మహంతి, జీఎం ప్రాజెక్టు జీపీఆర్ కృష్ణ హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుసుమకుమారి మాట్లాడుతూ భద్రతాపరమైన అవగాహన కార్యక్రమాలకు ఎన్ఐఎఫ్ఎస్ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రోడ్డు సేఫ్టీ పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

ఆరిలోవ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నిబిడీకృతమైన విజ్ఞాన సంపదను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని విశ్రాం డీజీపీ నండూరి సాంబశివరావు అన్నారు. ఆయన శుక్రవారం పాత డెయిరీ ఫారానికి సమీపంలోగల శ్రీ కృష్ణా గ్రామర్ స్కూలులో నిర్వహించిన జాతీయ సైన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. విజ్ఞాన ప్రదర్శనను తిలకించారు.

మూడు నెలలు సెలవుపై సింహాచలం దేవస్థానం ఈవో

» వ్యక్తిగత పనులపై యూఎస్ పయనం
» రాజమండ్రి డిప్యూటీ కలెక్టర్‌కు ఈవోగా అదనపు బాధ్యతలు

సింహాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న వి.త్రినాథరావు వ్యక్తిగత పనులపై యూఎస్ వెళ్తున్న కారణంగా రాష్ట్ర దేవదాయశాఖ మూడు నెలలపాటు ఆయనకు సెలవు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మార్చి 1 నుంచి మే 31 వరకూ సెలవు మంజూరు చేస్తున్నట్టు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. కాగా, రాజమహేంద్రవరం డిప్యూటీ కలెక్టర్, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషన్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సుబ్బారావుకు ఈ మూడు నెలల పాటు దేవస్థానం ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

మృతుడిది విశాఖ పోర్టు కాలనీ

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అరకు-పాడేరు జాతీయ రహదారిపై నారింజవలస గ్రామ సమీపంలో చినవంతెన వద్ద డివైడర్‌ను స్కూటీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం జరిగినఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

విశాఖపట్నం పోర్టు కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ రామ్మోహన్, అతని సహయకుడు సోమనాథ్‌తో కలిసి ఇటీవల పాడేరు ప్రాంతంలో తీసిన వివాహ ఫొటోలు ఇవ్వడానికి శుక్రవారం బయలుదేరారు. వీరు సాయంత్రం ఐదు గంటల సమయానికి నారింజవలస వద్దకు వచ్చేసరికి స్కూటీ డివైడర్‌ను ఢీకొనడంతో సహాయకుడు సోమనాథ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఫొటోగ్రాఫర్ రామ్మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయనకు వైద్య సేవలు అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సోమనాథ్ మృతదేహం

12వ వార్డులో జడ్సీ పర్యటన

ఆరిలోవ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి శుక్రవారం 12వ వార్డులో సందర్శించారు. చెత్తలు ఎక్కడ పడితే అక్కడ ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను తొలగించాలని, ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే గ్రీన్ బెల్ట్‌లోని కొన్ని ప్రాంతాల్లో అవులు, గేదెలను కట్టడం వల్ల గ్రీన్ బెల్ట్ పూర్తిగా నాశనం అయిపోతుందని అన్నారు. కాబట్టి గ్రీన్‌బెల్ట్‌లలో పశువులను కట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలతో పాటు భవన నిర్మాణ సామగ్రి కూడా ఎక్కడ పడితే అక్కడ వేయనివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల వాహన చోదకులు ఇబ్బందులకు గురి అయి ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉంటుందన్నారు. అనంతర ఆమె పలు హోటళ్లను తనిఖీ చేశారు. హోటల్స్‌లో ఎటువంటి ప్లాస్టిక్ పేపర్లు వాడకూడదని స్పష్టం చేశారు. బీఆర్టీఎస్ రోడ్డునకు ఆనుకోని కొంతమంది చిరు వ్యాపారస్తులు పెట్టిన తోపుడు బల్లును తొలగించాలని కూడా ఆమె సూచించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, బయో టెక్నాలజీ, మైక్రో టెక్నాలజీ, జుయాలజీ, మాథ్స్, కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించిన అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ ఇండియా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ విశాఖ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ హరి శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై వివిధ అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ పరికరాల మోడల్స్‌ను పరిశీలించి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించి పరిశోధనాత్మకతలో స్ఫూర్తిని కలిగించడమే జాతీయ సైన్స్ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సైన్స్‌తో విడదీయరాని బంధం

డాబాగార్డెన్స్: సైన్స్ అనేది ప్రతి ఒక్కరి జీవితంతో ముడిపడి ఉంటుందని, విడదీయరాని సంబంధం కలిగి ఉంటుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తెలిపారు. శుక్రవారం పాత జైల్‌రోడ్డులోని పైడా మహిళా డిగ్రీ కళాశాల, పైడా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మేధావులు, శాస్త్రవేత్తల కృషి ఫలితాలను ఈ రోజు మనం అనుభవిస్తున్నామన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ హరి శ్రీరాములు



బహుమతులు పొందిన నెహ్రూ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో...

సీతమ్మధార: సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మునిసిపల్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలి జిల్లా సమన్వయకర్త పి.రాజారావు ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాంప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు సుమారు 50 సైన్స్ వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌బీఎం యూపీ పాఠశాలలో..

డాబాగార్డెన్స్: స్థానిక ఆర్‌బీఎం యూపీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ ప్రారంభించి విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.కనకరాజు, కె.నాగేశ్వరరావు, ఉపాధ్యాయినులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో..

జ్ఞానాపురం: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని వృక్షశాస్త్ర విభాగం, జువాలజీ విభాగం, గ్రీన్‌గ్లోబ్ నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వృక్షశాస్త్ర రంగంలో శాస్త్రీయ ఆవిష్కరణలు, ప్రక్రియలపై వృక్షశాస్త్ర ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణలు దేశాభివృద్ధికి దోహదపడతాయన్నారు. జువాలజీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ కె.మాణిక్యకుమారి, డాక్టర్ ఇ.హరిణి, అధ్యాపకులు డాక్టర్ స్నేహ, డాక్టర్ రోజినా, డాక్టర్ పీకే జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న సెయింట్ జోసెఫ్ విద్యార్థినులు, అధ్యాపకులు

దీపం పథకం అమలులో మరింత అప్రమత్తం

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దీపం- 2 పథకం అమలులో మరింత అప్రమత్తంగా ఉంటామని, సబ్సిడీ నగదు వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల స్థితిగతులపై సమీక్షించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శుక్రవారం అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లాలో దీపం పథకం ద్వారా అర్హులైన అందరికి సకాలంలో రాయితీ నగదు జమ చేస్తున్నామని, సాంకేతిక సమస్యలు అధిగమించి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయనున్నట్టు పేర్కొన్నారు.

పారిశ్రామిక ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన

జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ఔత్సాహికులకు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. అన్ని రకాల సాంకేతిక అంశాలపై తీసుకున్న చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, ఆర్‌డీవో శ్రీలేఖ, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులపై పునరాలోచించాలి

» ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏఎస్ నాయుడు

మద్రిపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అరకొర నిధులు కేటాయించడం అన్యాయమని, కేవలం 10.8 శాతం నిధులతో విద్యారంగ అభివృద్ధి సాధ్యం కాదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీటీఎఫ్ విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏఎస్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని తెలపడం మంచి నిర్ణయమన్నారు. విద్యారంగాన్ని గాడిలో పెట్టాలన్నా, ఢిల్లీ మోడల్‌ను మించిన ఆంధ్రా మోడల్ విద్యా వ్యవస్థను రూపొందించాలన్నా కొఠారి కమిషన్ సిఫారసుల మేరకు బడ్జెట్‌లో 30 శాతం కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు.

విద్యారంగానికి కేటాయింపులు సరిపోవు

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి జరిపిన కేటాయింపులు ఏమాత్రం సరిపోవని ఆర్జీఈ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కనీసం 20 శాతం కేటాయిస్తే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావడానికి ఎక్కువ అవకాశం ఉండేదన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి'

అల్లిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధి కారులకు ఏడీసీ ఆర్.సోమన్నారాయణ సూచించారు. శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు,యూసీడీ అధికారులు, ఆర్‌పీలతో ఆయన జోనల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ ను ప్రజల నుంచి తీసుకుని సంబంధిత యాప్‌లో పొందుపరచాలన్నారు. సమావేశంలో జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, సహాయ వైద్యాధికారి కృష్ణంరాజు, ఏపీడీ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

'పోర్టు ఆస్పత్రిని అభివృద్ధి చేయాలి'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆస్పత్రిని పోర్టు యాజమాన్యం సొంత నిధులతో అభివృద్ధి చేయాలని సీఐటీయూ నాయకుడు కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించరాదని డిమాండ్ చేస్తూ చేస్తున్న దీక్షలు శుక్రవారం 151వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు ఆస్పత్రిని ప్రైవేటుపరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

» భారీ వాహనాలు రాకుండా నోవాటెల్ డౌన్‌లో ఇనుప గడ్డర్ల ఏర్పాటు

మహారాణిపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నోవాటెల్ డౌన్ నుంచి బీచ్‌రోడ్డు వైపు ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. భారీ వాహనాలు రాకుండా పంది మెట్ట ప్రాంతంలో ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. పందిమెట్ట జంక్షన్ నుంచి నోవాటెల్ హోటల్ మీదుగా బీచ్‌రోడ్డుకు వెళ్లే మార్గం పల్లపు ప్రాంతం. ఈ రహదారి మీదుగా వెళ్లే భారీ వాహనాలు నోవాటెల్ డౌన్‌కు చేరుకొనే సరికి బ్రేకులు ఫెయిలై ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో భారీ వాహనాలు బీచ్ రోడ్డులోకి దూసుకుపోయి పలువురు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. వారం రోజుల క్రితం ఓ లారీ ఈ డౌన్ నుంచి బీచ్‌రోడ్డు మీదుగా పిల్లల పార్కు లోపలకు దూసుకుపోయింది.

ఈ సంఘటన తెల్లవారు జామున జరగడం, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణపై అధి కారులు దృష్టి పెట్టారు. పందిమెట్ట జంక్షన్ నుంచి నోవాటెల్ డౌన్ వైపు భారీ వాహనాలు వెళ్లకుండా శుక్రవారం తొమ్మిది అడుగుల ఎత్తు న ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఇటు వైపు లారీలు, బస్సులు రాకుండా చర్యలు తీసుకున్నారు. దీని వల్ల ప్రమాదాలు తగ్గు ముఖం పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.



పందిమెట్ట జంక్షన్ నుంచి నోవాటెల్ డౌన్‌లో ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లు

బార్‌లలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

మహారాణిపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు బార్‌లలో శుక్రవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ జిల్లాలో 117 బార్లలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న బార్‌లలో స్టేషన్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కౌంటర్ సేల్స్ చేసినా, సమయపాలన పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బారులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ముస్లింల డిమాండ్

» మక్కా మసీదు వద్ద ప్రదర్శన

మహారాణిపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీ కోటాలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ముస్లింలు డిమాండ్ చేశారు. శుక్రవారం మహారాణిపేటలోని మక్కా మసీదులో రంజాన్ ప్రార్థనల అనంతరం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో బ్యానర్ చేతబూని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కా మసీదు కమిటీ అధ్యక్షుడు ఎం.డి.మున్నీరు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు ముస్లింల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న మహ్మద్ నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు చిరాగ్‌అలీ సైఫుద్దీన్ మాలిక్, సయ్యద్ గౌస్, నూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



మహారాణిపేట మక్కా మసీదు వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరం వేదధర్మ రక్షణ సభ హాలులో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శ్రుతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వేత్త కేపీ రాజు, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, పత్రికా సంపాదకుడు వీవీ రమణమూర్తి, వంకాయల సన్యాసి రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అనంతరం పాణంగపల్లి రంగనాథ ఆచార్యులు ఆధ్వర్యంలో సామూహికంగా అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించి, విష్ణు సహస్రనామాల పారాయణం చేశారు. శ్రుతిలయ భక్తి సంగీత సంస్థ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు, ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఎ.వెంకటరావు బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.

నగరానికి చెందిన పలు సాంస్కృతిక సంస్థలు నిర్వహించిన భక్తి సంగీత కచేరీలు, కూచిపూడి నృత్యాంశాలు, వేణుగానం వీనుల విందుగా సాగాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు



నృత్యం చేస్తున్న కళాకారులు

సంక్షేమ బడ్జెట్

... 5వ పేజీ తరువాయి

ప్రకటించింది. విశాఖపట్నం అత్యంత ప్రధానమైన జిల్లా కాబట్టి ఇక్కడ కూడా ఒకటి వస్తుంది. వృద్ధులకు ఇది ఆసరాగా నిలుస్తుంది.

ఐటీ కంపెనీలకు రాయితీలు

ఐటీ కంపెనీలకు రాయితీలుగా అందించేందుకు బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించారు. గతంలో బకాయిలు కొన్ని రావలసి ఉంది. వాటిలో 50 శాతం వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసే అవకాశం ఉందని ఐటీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.50 కోట్లు కేటాయించారు. ఇది యువ ఇంజనీర్లకు మంచి అవకాశం అని ఐటీ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు

ప్రభుత్వ పాఠశాలలకు మేలు చేసే నిర్ణయం బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యుత్ బిల్లును ప్రభుత్వమే భరిస్తుందని, ఆ భారం తగ్గించేస్తామని వెల్లడించింది. విశాఖ జిల్లాలో 586 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల స్థాయిని బట్టి ప్రాథమిక పాఠశాల అయితే నెలకు సగటున రూ.500, ఉన్నత పాఠశాల రూ.2,500 వరకు బిల్లు వస్తుంది. ఆ భారం ఇక తప్పినట్టే. కొన్ని పాఠశాలలకు లక్ష రూపాయల బకాయిలు ఉన్నాయి. వాటిని కూడా రద్దు చేసే అవకాశం ఉంది.

పర్యాటకానికి భారీ నిధులు

రాష్ట్రంలో పర్యాటకం, యూత్, క్రీడలకు కలిపి రూ.469 కోట్ల బడ్జెట్ కేటాయించారు. గతంతో పోల్చుకుంటే ఇది భారీ బడ్జెట్. అంటే రాష్ట్రంలో పర్యాటకాన్ని, క్రీడలను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ నిధులు ప్రకటించింది. విశాఖ జిల్లాలో నిధులు లేక ఆగిపోయిన హరిత (అప్పుఘర్) వంటి అనేక ప్రాజెక్టులు ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తయ్యే అవకాశం ఉంది.

ఆశించిన ఆదాయం వస్తే ఆర్థికంగా మేలు



- నరేశ్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్.

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో రూ.48 వేల కోట్ల ఆదాయం పెరుగుతుందని అంచనాలు చూపించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది బాగా అధికం. అంచనాలను అందుకుంటే ఆర్థిక పరిస్థితి మెరుగై యువతకు ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



- ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, రిటైర్డ్ ఎకనామిక్స్ విభాగాధిపతి

అభివృద్ధి, సంక్షేమానికి సమానంగా ప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో స్థిరత్వాన్ని సాధించేందుకు అనుగుణంగా కీలక శాఖలకు నిధులను కేటాయించారు. విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపించింది. గడిచిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు భారీగానే నిధులు కేటాయించారు. 2047 లక్ష్యాలను సాధించేందుకు అభివృద్ధి నిధులను కొంత పెంచి ఉంటే బాగుండేది. గ్రోత్ రేటు ప్రస్తుతం 13 శాతంగా ఉంది. వచ్చే ఏడాది నుంచి 15 శాతం లక్ష్యంగా చేసుకుని ప్రణాళికలు వేయాలి. అప్పుడే విజన్-2047 లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంది.

బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం



బీసీల సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు హర్షణీయం. సూపర్ సిక్స్ పథకాలకు నిధులిచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించి చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారు.

- గండి బాబ్జీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

సంక్షేమ రంగానికి ప్రాధాన్యం



బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20 వేలు అందుతాయి. తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు అమ్మఒడికి చెంపదెబ్బ ప్రతీ కుటుంబానికి ఆరోగ్య బీమాతో ఎంతో మేలు. మత్స్యకారుల సాయం 20 వేలకు పెంపుతో వారికి లబ్ధి. ఆదరణ పథకం పునఃప్రారంభించి నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు.

- సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణ ఎమ్మెల్యే

'సూపర్ సిక్స్'కు కేటాయింపులేవీ?



సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. తల్లికి వందనం పథకం కింద ఎందరు పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించినా ఆశించిన స్థాయిలో నిధులేవీ. విద్య, వైద్యానికి మెరుగైన కేటాయింపులున్నాయి. వ్యవసాయ రంగానికి అధికంగా నిధులిస్తే బాగుండేది. బడ్జెట్ అంకెల గారడీ. కూటమి ప్రభుత్వం కీలక రంగాలను విస్మరించినట్టు కనిపిస్తోంది.

- వజ్జపర్తి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సంధ్యాదేవి

... 5వ పేజీ తరువాయి

అప్పగిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాలో ఆమె ముందున్నారు. అందుకు అనుగుణంగానే ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు శుక్రవారం పదవీ విరమణ పొందారు.

ఆయన స్థానంలో సంధ్యాదేవి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమెకు నియామక ఉత్తర్వులను శుక్రవారం సాయంత్రం డాక్టర్ బుచ్చిరాజు అందజేశారు.

కిడ్నీ ఇప్పిస్తామంటూ లక్ష రూపాయలు కొట్టేసిన నకిలీ వైద్యులు!

... 5వ పేజీ తరువాయి

తీసుకువెళ్లారు. నరసింహానికి ఫోన్ చేయగా ఆ డబ్బును పిల్లల వార్డు వద్ద ఉన్న తన కారు డ్రైవర్‌కు ఇవ్వాలని చెప్పాడు. రాంజీ వాళ్లు చెప్పిన విధంగానే డబ్బును ఇచ్చేశాడు. డబ్బులు తీసుకున్నప్పటి నుంచి ముగ్గురి జాడ లేదు.

సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో కేజీహెచ్‌లో సంబంధిత విభాగాలలో వైద్యులను సంప్రతించగా అటువంటివారు ఎవరూ లేరని తెలిపారు. దీంతో తమ నుంచి లక్ష రూపాయలు కాజేసింది నకిలీ డాక్టర్లుగా గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.

సిటీలో విజిటర్స్ మానటరింగ్ సిస్టమ్

... 5వ పేజీ తరువాయి

ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించారు. తమ హోటళ్లలో దిగేవారి వివరాలను వెంటనే వారికి కేటాయించిన లాగిన్ ద్వారా యాప్‌లో నమోదుచేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఏ హోటల్/లాడ్జిలో ఎవరు ఎప్పుడు చెక్ ఇన్ అయ్యారు, ఎప్పుడు చెక్ అవుట్ అయ్యారనేది పోలీసులకు ఎప్పటికప్పుడు తెలుస్తుండేది. హోటల్/లాడ్జిల్లో చెకి ఇన్ అయినవారిలో ఎవరైనా అనుమానితులు, పాత నేరస్థులు ఉన్నట్టయితే వెంటనే అక్కడకు వెళ్లి వారు నగరానికి ఎందుకువచ్చారు?, ఎక్కడకు వెళతారనే వివరాలను సేకరించేవారు. ఏదైనా తేడాగా అనిపిస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకోవడం ద్వారా నేరం జరగకుండా ముందుగానే అడ్డుకునేందుకు అవకాశం ఉండేది.అయితే శ్రీకాంత్ తర్వాత వచ్చిన సీపీలు నిర్లక్ష్యం చేయడంతో వీఎంఎస్ మరుగునపడిపోయింది. తాజాగా సీపీ శంఖబ్రతబాగ్చి నగరంలో నేరాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదే సమయంలో వీఎంఎస్‌ను తిరిగి అమలు చేయడం వల్ల మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చునని భావించారు. దీంతో ప్రతి హోటల్/లాడ్జికు వచ్చే వారి వివరాలను ఎప్పటికప్పుడు అందులో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ విభాగం పోలీసులు వీఎంఎస్‌ను పునరుద్ధరించే పనులపై దృష్టిసారించారు.

కేజీహెచ్‌లో గాడితప్పిన గైనకాలజీ వార్డు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. మగ బిడ్డ పుట్టినట్టు చెప్పిన సిబ్బంది ఆడ శిశువును చేతిలో పెట్టడంతో కృష్ణా జిల్లాకు చెందిన మహిళ కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారంతా బయటకు వచ్చి ఆందోళనకు సిద్ధమయ్యారు. దీంతో సూపరింటెండెంట్ వచ్చి సీసీ కెమెరాలు, ఫొటోలను చూపించి ఇరు వర్గాలను ఒప్పించి ఎవరి బిడ్డను వారికి అప్పగించారు. అయితే, ఇది పొరపాటున జరిగిందా?, ఇంకేమైనా కారణాలు ఉన్నాయా?...అన్న దానిపై విచారణ జరిపేందుకు సూపరింటెండెంట్ కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ వాసవీ లత, డాక్టర్ సంధ్యాదేవి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మలతో కమిటీ ఏర్పాటుచేశారు. ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించనుంది.

ఇప్పటికీ వసూళ్ల పర్వం

ఈ విభాగంలో సిబ్బంది అబ్బాయి పుడితే రూ.3 వేలు, అమ్మాయి పుడితే వేయి నుంచి రూ.1500 వరకూ వసూలు చేస్తుంటారు. ఈ మొత్తాన్ని లేబర్ రూమ్‌లో పనిచేసే సిబ్బంది పంచుకుంటారు. ఆర్థికంగా ఎవరైనా ఇవ్వలేని స్థితిలో ఉంటే చుక్కలు చూపిస్తారు. వసూళ్లపై అధికారులకు ఎంతోమంది బాధితులు ఫిర్యాదుచేశారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక గర్భిణులు, బాలింతలు, వారి బంధువులు పట్ల ఆయాలు, వార్డు బాయ్‌లు వ్యవహరించే తీరు అత్యంత దారుణంగా ఉంటుంది. ఇష్టానుసారంగా మాట్లాడుతుంటారు. ఇప్పటికైనా ఈ విభాగం ప్రక్షాళనపై అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం

» రూ.2 కోట్లు కేటాయించిన జీవీఎంసీ
» పాత కట్టడాలను తొలగిస్తున్న సిబ్బంది

మల్కాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంత పరిధి ఏడు వార్డులకు సంబంధించిన మల్కాపురం శ్మశానవాటిక అభివృద్ధి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. పారిశ్రామిక ప్రాంతంలో దాదాపు మూడు లక్షలాది మందికి ఇది ఒక్కటే శ్మశాన వాటిక. నేవీలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆ మృత దేహాలకు ఇక్కడే ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇక్కడ ఓ వైపు హిందువులు, మరో వైపు క్రైస్తవులకు కేటాయించారు. శ్మశానాన్ని ఆనుకుని ఉన్న ముస్లింల శ్మశాన వాటికను గతంలోనూ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. తాజాగా మల్కాపురం స్వర్గధామంలో పనులు ప్రారంభించారు. ఇందుకోసం


మృతదేహాలను దహనం చేసిన షెడ్ తొలగింపు

జీవీఎంసీ రూ.2 కోట్లు మంజూరుచేసింది. మృతదేహాలను దహనం చేసేందుకు వీలుగా కొత్త షెడ్లు, కాటికాపరికి ప్రత్యేక గది, విద్యుత్, తాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం, పిండ ప్రదానాలకు ప్రత్యేక గది, గ్రీనరీ, వాహనాల పార్కింగ్‌కు వీలుగా వివిధ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే


కుప్పకూలిన కాటికాపరి గది

పీజీవీఆర్ నాయుడు (గణబాబు) కార్పొరేటర్ పీవీ సురేశ్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. నాలుగైదు నెలల్లో పనులు పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శ్మశానవాటికలో ఉన్న సత్యహరిశ్చంద్ర, శివుడి విగ్రహాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు.

ప్రజారంజకంగా రాష్ట్ర బడ్జెట్

» టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి చేతిలో దగా పడిన ఆంధ్రప్రదేశ్ ప్రజలను మరింత అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపేందుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఈ బడ్జెట్ ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందనడానికి ఇదో నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివప్రసాదరావు, సింహాచలం, తాతారావు, రాజారావు పాల్గొన్నారు.

మూడు నెలలు సెలవుపై సింహాచలం ఈవో

» రాజమహేంద్రవరం డిప్యూటీ కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు

సింహాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న వి.త్రినాథరావు వ్యక్తిగత పనులపై యూఎస్ వెళ్తున్న కారణంగా దేవదాయశాఖ మార్చి 1 నుంచి మే 31 వరకూ సెలవు మంజూరు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం డిప్యూటీ కలెక్టర్, దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.సుబ్బారావుకు సింహాచలం ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

బార్‌లలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు


వేపగుంట జంక్షన్‌లోని బార్‌లో తనిఖీలు చేస్తున్న ప్రొహిబిషన్ అధికారులు

వేపగుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 93,94వ వార్డుల పరిధిలోని ప్రహ్లాదపురం, నాయుడుతోట, వేపగుంట పరిసరాల్లో ఉన్న బార్‌ల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. మద్యం సీసాలపై ధరలు, స్టాక్ వివరాలు, మద్యం కొలతలు, నిర్దేశించిన సమయాలను పాటిస్తున్నారా లేదా అన్న విషయాలను పరిశీలించారు. బార్‌లపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో ఈ తనిఖీలు చేపట్టినట్టు సమాచారం. అయితే, నామమాత్రంగా తనిఖీలు చేసి వదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నారు. దాదాపు ఆరు బార్లకు పైగా తనిఖీలు చేపట్టినా ఎటువంటి లోపాలు వెలుగుచూడకపోవడం గమనార్హం. ఈ తనిఖీల్లో పెందుర్తి ఎక్సైజ్ సీఐ సరోజాదేవి, ఎస్ఐ మాధవి, హెచ్‌సీ ప్రసాద్, పీసీ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో....

గాజువాక: స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు బార్‌లను సీఐ నాగశ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలని, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని బార్ నిర్వాహకులకు సూచించారు. బార్‌ల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల్లో సందడిగా జాతీయ సైన్స్ దినోత్సవం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలను సృష్టిస్తారని రామకృష్ణ స్కూలు డైరెక్టర్ పి.వాసుదేవరావు అన్నారు. కూర్మన్నపాలెంలో శ్రీ రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం సైన్స్ డే వేడుకలు జరిగాయి. విద్యార్థులు 50 నమూనాలు ప్రదర్శించారు. ద్రావణాల ద్వారా విద్యుత్, ప్లాస్టిక్‌తో అనర్థాలు, వాటర్ ట్రీట్‌మెంట్, కెలిడియో స్కోప్, పెరిస్కోప్ వినియోగం, జీర్ణవ్యవస్థ పని తీరు, శబ్ద కాలుష్యం నష్టాలు, రూమ్ హీటర్, పౌష్టికాహారం, రాష్ట్రాలు వాణిజ్య పంటలు, ఫుడ్ వెబ్ తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రిన్సిపాల్ లలితకుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. గ్రీన్‌సిటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పీఎస్‌ఎల్‌వీ సి-13 రాకెట్, పవన విద్యుత్, పాప్ కార్న్ మిషన్, ఏటీఎం, ఎయిర్ కండిషన్ తదితర చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుశీల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ప్రజంటేషన్‌లో విజ్ఞాన్ విద్యార్థులు

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు

మల్కాపురం: విద్యార్థులు శాస్త్ర విజ్ఞానాన్ని అలవరచుకోవాలని ములగాడ ఎంఈవో త్రినాథరావు పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జనతా కాలనీలోని ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వివిధ ప్రాజెక్టులను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైవీ ప్రసాదరావు, డైరెక్టర్ వీఏ రావు, జ్ఞానవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరుశు రాం, మండల కార్యదర్శి ఎం.వాసుదేవరావు, ఎం.త్రినాథరావు, ఎస్.లక్ష్మణరావు రంగనాథ్, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.


రామకృష్ణ పబ్లిక్ స్కూలు విద్యార్థుల ప్రదర్శన

విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో..

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పరిశోధనలపై ఆలోచనలు పెంపొందించుకుని రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ మధుసూదనరావు, సత్యగురు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎల్‌సీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు శ్రీనగర్‌లో సీఎల్‌సీ సంస్థ చైర్మన్ బిషప్ సుధీర్ మహంతి ఆధ్వర్యంలో శుక్రవారం పేదలు, నిరాశ్రయులైన మహిళలు 50 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాల ద్వారా పేదలకు వైద్య సేవలను చేరువచేస్తున్నారు. లేబర్ కాలనీల్లో తాగునీటి బోర్లు ఏర్పాటు తోపాటు అన్నదాన కార్య క్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మెర్సీ మహంతి, ఆల్‌ఫ్రెడ్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అగనంపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో స్టీల్‌ప్లాంట్ రహదారిలోని నడక మైదానం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ ద్వారకానాథ్ పారంభించారు. సుమారు 200 మంది రోగులు వైద్య సేవలు పొందారు. మందులు అందించారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, మడుగుల నరసింగరావు, పట్టా రామఅప్పారావు, కనకభవాని, గుదే సుశీలగజేంద్రరావు, రామారావు, కరణం పైడిరాజు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి మహాభిషేకం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు గరుడాద్రిపై కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని కాలభైరవ స్వామికి శుక్రవారం మహాభిషేకం జరిగింది. మౌళి అమావాస్య సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం 108 కలశాలతో మహాభిషేకం, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. గ్రేటర్ 74వవార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, కమిటీ సభ్యులు గొరుసు రామలక్ష్మి, పిట్ట ప్రకాశరెడ్డి, హిమజ, నాగమణి పూజల్లో పాల్గొన్నారు.


కాలభైరవస్వామికి మహాభిషేకం చేస్తున్న దృశ్యం


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీపీ

సత్యమాంబకు క్షీరాభిషేకం

పెందుర్తి రూరల్: వేపగుంట సత్యమాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, మాజీ సర్పంచి ఆళ్ల తాతారావు, స్థానిక నాయకులు డబ్బీరు వెంకటరావు, మద్దాల శ్రీనివాసరావు, ఆడారి సన్యాసిరావు, దాడి అర్జునరావు, కాళ్ల ఈశ్వరరావు, నాగరాజు, త్రినాథరావు, అప్పారావు, అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు.

డాక్టర్ బుచ్చిరాజుకు ఘనంగా వీడ్కోలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన జి.బుచ్చిరాజుకు వివిధ విభాగాల ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. మెడికల్ కాలేజీలోని సెమినార్‌హాల్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ తాను ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సమయంలోనే మెడికల్ కాలేజీ వందేళ్ల వేడుకలు జరగడం గర్వంగా ఉందన్నారు. కాలేజీ ప్రతిష్ఠను పెంచేందుకు అంకితభావంతో కృషిచేశానన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ మన్మథరావు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తితో వెళుతున్నా..

వైద్య వృత్తి పవిత్రమైనదని, ఇన్నేళ్లలో ఎంతోమందికి సేవ చేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉందని డాక్టర్ ధవళ భాస్కరరావు పేర్కొన్నారు. కేజీహెచ్ ఆర్‌ఎంవోగా పనిచేసిన ఆయన ఆయన శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా అతనిని కేజీహెచ్ వైద్యులు సత్కరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మాట్లాడుతూ కేజీహెచ్ అభివృద్ధిలో భాస్కరరావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ వాసవీ లత, డాక్టర్ రాధాకృష్ణ, డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్, ఏఆర్‌ఎంవో డాక్టర్ రాజేష్, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, కేజీహెచ్ ఏడీ సుమతి, విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌కుమార్, మేనేజర్ సత్యనారాయణ, ఎంఆర్‌వో పీఎం జవహర్‌లాల్, అకౌంటెంట్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బుచ్చిబాబును సత్కరిస్తున్న దృశ్యం

'ఉక్కు'లో విస్తృత తనిఖీలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఓరిజినల్ పాస్‌లు కలిగి ఉండాలని, జిరాక్స్‌లతో ప్రవేశం కల్పించమని ఉక్కు సీఐఎస్ఎఫ్ అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాస్‌ల కలర్ జిరాక్స్‌లను ఇతరులకు ఇవ్వవద్దని సూచిస్తున్నారు. ప్లాంటులో ప్రతి విభాగం వద్ద సిబ్బందిని నియమించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సీఐఎస్ఎఫ్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కార్మిక సమ్మెపై ప్రచారం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెల 7న తలపెట్టనున్న సమ్మెపై అఖిలపక్ష నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు సకాలంలో చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు లేకుండా చూడాలని, టెండర్ ప్రక్రియను పునరుద్ధరించి ఉపాధి కల్పించాలని ప్రచారం చేశారు. మంత్రి రవి, శ్రీనివాస రాజు, ఆలం, వంశీ పాల్గొన్నారు.

దుర్గమాంబకు పూజలు



అగనంపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్ర పారాయణం చేశారు. చిత్రా గణేశ్, చిత్రా రామారావు, తదితరులున్నారు.

ఆలయంలో చోరీ

దుర్గమాంబ ఆలయంలో హుండీ చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి అందులోని రూ.5వేల నగదు దోచుకుపోయారు. కమిటీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోకుల యాదవ సేవా సంఘం కార్యవర్గం

మల్కాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోకుల యాదవ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం నియమించారు. గౌరవాధ్యక్షుడిగా పుర్రె అప్పారావు, అధ్యక్షుడిగా పుర్రె సురేశ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా నూనెల వెంకటరమణ, ఏదూరి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా ఉరుకూటి శ్రీనివాసదేవా ఎంపికయ్యారు. కార్యదర్శులు, సహాయ, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, కోశాధికారి, సహాయ కోశాధికారి, గౌరవ సలహాదారులు, లీగల్ అడ్వైజర్స్‌తో పాటు మరో పది మంది కమిటీ సభ్యులు నియమితులయ్యారు.

సినిమా గైడ్

● **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
● **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
● **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
● **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 13, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 42, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ16, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 36, బంగాళదుంపలు 14, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 60, అల్లం 52, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు(కిలో) 65, బద్దచిక్కుడు 34, దోసకాయలు 28, వెల్లుల్లి 100,కొబ్బరికాయ 25, బీన్స్ 36, కీరదోస 26, కాప్సికమ్ 38, పొట్లకాయ 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 46, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180

రక్తదానంపై అపోహలు వీడాలి: సీఐ


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అపోహలు వీడి రక్తదానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని సీఐ కేవీ సతీశ్‌కుమార్ అన్నారు. సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఆధ్వ ర్యంలో సాయిరామ్ మెడికల్స్ స్థానిక జంక్షన్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 120 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 32 మంది అవయదానికి అంగీకరిస్తూ పత్రాలను ఇచ్చారు. సీఐ రక్తదాతలకు ధ్రువీకరణపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. సేకరించిన రక్తాన్ని మదర్, అమ్మ బ్లడ్‌బ్యాంకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సిరిమల్ల గణేశ్. పెంటకోట భాను. వినయ్, తేజ నారాయణ, గోపి, సునీత, సురేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

గాజువాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయనున్నారు. విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా మార్గమధ్యలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

రేపటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు


ఉత్సవాలకు సిద్ధమైన వెంకన్న ఆలయం

వేపగుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం 25వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఆదివారం నుంచి ఏడో తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. శోభాయాత్రతో అంకుర్పారణ జరుగుతుంది. తిరు కల్యాణ మహోత్సవంతో వేడుకలు ముగుస్తాయని అర్చకులు శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం


నార సంచులను పంపిణీ చేస్తున్న చిత్రారావు

అగనంపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్రం జంక్షన్‌లో మహాత్మా గాంధీ స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. బొర్రమాంబ లేడీస్ టైలర్ల సంఘం సభ్యులు సమకూర్చిన గుడ్డ నార సంచులను పంపిణీ చేశారు. అనంతరం సంస్థ అధ్య క్షుడు చిత్రా రామారావు మాట్లాడుతూ టైలర్ల జీవనోపాధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శోభారాణి, మోహన్‌బాబు, సురేశ్, అప్పారావు, తరుణ్‌కుమార్, పార్వతి, తదితరులు పాల్గొన్నారు. జంగాల కాలనీలో బీజేపీ నేత కోసూరి తాతారావు టైలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. బాబూరావు, తిరుపతిరావు, లక్ష్మణరావు, కుమారి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి, సరుగుడు తోటలు దహనం


ఆకతాయి చేష్టలతో దహనమైన తోటలు

గోపాలపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల ఆగడాలకు కొత్తపాలెం శివారున నీలగిరి, సరుగుడు తోటలు దహనమయ్యాయి. మూడుగుళ్లకు సమీపాన ఎకరా భూమిలో పొలమరశెట్టి నరసింగరావు కౌలురైతు నీలగిరి, సరుగుడు తోటలు సాగు చేస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు తోటకు నిప్పంటించారు. సమీపంలోని ఉన్న కొందరు రైతులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కొత్తపాలెం గ్రామ శివారులో వ్యవసాయ క్షేత్రాలు, నిర్మానుష్య స్థలాల్లో మద్యం, గంజాయి సేవించే యువకులు వస్తున్నారు. వీరు మత్తులో ఇలాంటి పనులకు పాల్పడుతున్నారు. రెండేళ్ల క్రితం మూడుగుళ్ల సమీపంలో మందుబాబులు ఓ వ్యక్తిని హత్య చేశారు. సంతోష్‌నగర్, మూడుగుళ్ల ఏరియా, కొత్తపాలెం చర్చి తదితర ప్రాంతాల్లో ఆకతాయిలు, జూదగాళ్ల బెడద అధికంగా ఉందని, పోలీసులు దృష్టి సారించి నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంటు ఎస్ఎంఎస్ విభాగంలో పేలుడు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటులోని స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-1 విభాగంలో శుక్రవారం పేలుడు సంభవించింది. ఉద్యోగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా ద్రవపు ఉక్కును సీసీడీ (కంటిన్యూ కాస్టింగ్ డిపార్టుమెంట్)కు పంపే క్రమంలో తయారయ్యే స్లాగ్‌ను పాట్ ద్వారా యార్డ్ పిట్‌కు తరలించారు. ఆ సమయంలో పిట్‌లో నీరుండడంతో స్లాగ్ వేడికి పేలుడు సంభవించింది. పేలుడుకు పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. ఈ సమయంలో ఉద్యోగులు వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది ఈ ప్రమాదం వల్ల ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగలేదని యాజమాన్యం ప్రకటించింది.

విపత్తులపై సమరం

అగ్ని ప్రమాదాల నియంత్రణలో సిబ్బంది సేవలు భేష్



పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణలో సిబ్బంది

పెదగంట్యాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): **వేసవి ప్రారంభం కానుంది. అగ్ని ప్రమాదాలు సంభవించడంలో ఏడాది మొత్తమ్మీద ఎనిమిది నెలలు ఒక ఎత్తైతే వేసవి నాలుగు నెలలు ఒక ఎత్తు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నాయి అగ్నిమాపక దళాలు. సాధరణ ఫైర్, ఆయిల్ ఫైర్, ఎలక్ట్రికల్ ఫైర్, మెటాలిక్ ఫైర్, గ్యాస్ ఫైర్‌లను సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. ఫోన్ కాల్ వచ్చిన పది నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకుఉటునేలా యంత్రాలను, యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు.**

- ప్రమాదాలు సంభవించకుండా గృహిణులకు శిక్షణ
- పారిశ్రామిక సిబ్బందికి ఎస్టింగ్విషన్ వినియోగంపై శిక్షణ
- పిల్లలు, తల్లులకు ప్రత్యేక అవగాహన తరగతులు
- వేసవి నేపథ్యంలో ఆధునిక పరికరాలతో సిద్ధం
- ముందు జాగ్రత్తలతోనే ప్రమాదాలకు దూరం

పెదగంట్యాడలోని ప్రధాన అగ్నిమాపక కేంద్రం, గాజువాక పారిశ్రామికవాడలోని ఒక అవుట్‌పోస్టు, సుశిక్షితులైన 26 మంది శిబ్బంది, మూడు అగ్నిమాపక వాహనాలతో నిత్యం అప్రమత్తంగా ఉన్నారు. శీలానగర్, యారాడ, గంగవరం, పిట్టవానిపాలెం హద్దులుగా ఈ మధ్య ప్రాంతం పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రం పరిధిలోనికి వస్తుంది.

గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడలు సవాల్‌గా నిలుస్తున్నాయి. ఎప్పుడు ఏపరిశ్రమలో ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. సాధారణ ఫైర్, ఎలక్ట్రికల్ ఫైర్ మెటాలిక్ ఫైర్‌లు జరిగే అవకాశం ఉంటుంది. ఒక్కో ఫైర్ నియంత్రణకు ఒక్కో విధానం అవలంబించి నియంత్రించాల్సి ఉంటుంది. నీరు, కార్బన్‌డైఆక్సైడ్ గ్యాస్, ఫోమ్ వంటి వాటిని వినియోగించి మంటలను అదుపులోకి తెస్తుంటారు.

గృహిణులకు శిక్షణ

గ్యాస్ ఫైర్ నియంత్రణలో గృహిణులకు తరచూ శిక్షణ ఇస్తున్నారు. వారికి మాక్ డ్రిల్ చేసి చూపిస్తున్నారు. వంట గ్యాస్ లీకై సిలిండర్ నుంచి మంటలు వచ్చే విధానం, భయపడి పరుగులు తీయకుండా చాకచక్యంగా దానిని నియంత్రించే విధానం వివరిస్తున్నారు. గృహిణులతో ఎక్సర్‌సైజ్ చేయిస్తున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగేందుకు కారణాలు, వాటిని సత్వరమే నియంత్రించే విధానం గృహిణులకు వివరించి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన ప్రాంతాల్లో ఇలాంటి మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు.



పరిశ్రమల్లో ఎస్టింగ్విషర్ వినియోగంలో కార్మికులకు శిక్షణ

ఎస్టింగ్విషన్ ఆపరేషన్‌పై అవగాహన

పారిశ్రామిక వాడలు, విద్యా సంస్థలు, కార్పొరేట్ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ ఆస్పత్రులు ఇలా ప్రజల తాకిడి ఎక్కువగా ఉన్న అన్ని ప్రాంతాల్లో ఎస్టింగ్విషర్స్ ఉంటున్నాయి. దానిని ఆపరేట్ చేసే విధానం ఆసంస్థలోని కొద్దిమందికి మాత్రమే తెలుసు. ప్రమాద సమయానికి తెలిసిన మనుషులు అందుబాటులో లేకుంటే పరిస్థితి అనూహ్యం. అందుకే ఇలాంటి సంస్థల్లో ఉన్న వారందరికీ ఎస్టింగ్విషర్ ఆపరేట్ చేసి మంటలు అదుపు చేసే విధానంపై శిక్షణ ఇస్తుంది పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది. మాక్‌డ్రిల్ నిర్వహించి మరీ ఎస్టింగ్విషర్ ఆపరేట్ చేయిస్తుంది.

తగ్గిన ప్రమాదాలు

గడిచిన మూడేళ్ల గమనిస్తే అగ్ని ప్రమాదాల సంఖ్య తగ్గినట్టు తెలుస్తుంది. 2022-23లో 99 కాల్స్ వచ్చాయి. ఈ ప్రమాదాల్లో రూ.44.64 కోట్ల ఆస్తులను కాపాడగా, 19.94 కోట్ల ఆస్తులకు నష్టం వాటిల్లింది 2023-24లో 81 కాల్స్ వచ్చాయి. ఇందులో రూ.17.71 కోట్ల ఆస్తులు రక్షించగా రూ.2.96 కోట్ల ఆస్తులకు నష్టం వాటిల్లింది. 2024-25లో ఇప్పటివరకు 74 కాల్స్‌కు హాజరై రూ.7.93 కోట్ల ఆస్తులను రక్షించారు. రూ.1.15 కోట్ల ఆస్తులకు నష్టం వాటిల్లింది.

నిత్యం అప్రమత్తం



ఎటువంటి అగ్ని ప్రమాదాలు సంభవించినా, విపత్కర పరిస్థితులు ఏర్పడినా వాటిని సమర్థంగా ఎదుర్కొంటాం. ఆధునిక సాంకేతికత కలిగి ఫైర్ ఎక్విప్‌మెంట్, వాహనాలు సమకూర్చుకున్నాం. సుశిక్షితులైన సిబ్బంది ఉన్నారు. ప్రమాదాలు జరిగిన తరువాత నివారణ చర్యల కంటే, ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహనా కల్పిస్తున్నాం. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ఆస్పత్రుల్లోని సిబ్బందిని నిత్యం అప్రమత్తం చేస్తున్నాం.

- ఎన్.గోపీకృష్ణ, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్

జిల్లాలో సూర్యాబాగ్, మర్రిపాలెం, పెదగంట్యాడ, చిట్టివలస అగ్నిమాపక కేంద్రాలున్నాయి. సూర్యాబాగ్ ఫైర్ స్టేషన్‌లో మూడు అగ్నిమాపక శకటాలున్నాయి. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, ఎనిమిది మంది లీడింగ్ ఫైర్‌మెన్‌లు, 40 మంది ఫైర్‌మెన్‌లు, ముగ్గురు హోమ్ గార్డులు విధులు నిర్వహిస్తున్నారు. మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రానికి మూడు అగ్నిమాపక శకటాలున్నాయి. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, ఎనిమిది మంది లీడింగ్ ఫైర్‌మెన్‌లు, 40 మంది ఫైర్ మెన్‌లు, ఇద్దరు హోమ్ గార్డులు పనిచేస్తున్నారు. పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రంలో మూడు ఫైరింజిన్లు ఉన్నాయి. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, ఆరుగురు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, 26 మంది ఫైర్ మెన్‌లు ముగ్గురు హోమ్ గార్డులు విధులు నిర్వహిస్తున్నారు. చిట్టివలస అగ్నిమాపక కేంద్రానికి ఒక ఫైరింజను ఉంది. దీనికి ఒక ఫైర్ ఆఫీసర్, ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, 14 మంది ఫైర్‌మెన్‌లు, ఒక హోమ్ గార్డు ఉన్నారు. ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినట్టు సమాచారం అందినాసంఘటనా స్థలానికి దగ్గరగా ఉన్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హాజరవుతారు. వెంటనే మిగిలిన నాలుగు అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇస్తారు. ఆయా కేంద్రాల సిబ్బంది కూడా అలర్ట్‌గా ఉంటారు. స్మాల్, మీడియం ఫైర్ అయితే సమీప స్టేషన్ సిబ్బందే మంటలను నియంత్రిస్తారు. భారీ ప్రమాదం సంభవిస్తే మిగిలిన స్టేషన్ల వాహనాలు, సిబ్బంది సహాయం తీసుకుంటారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రం

క్రైం... crime news

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



భీమునిపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా వున్నాయి. బీచ్‌రోడ్డులోని బోయవీధి శివారు సముద్రంలో ఓ వ్యక్తి కొట్టుకుపోవడాన్ని మత్స్యకారులు గుర్తించారు. వెంటనే అతడిని ఒడ్డుకు తీసుకువచ్చి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతనిని ప్రభుత్వ కేజీహెచ్‌కి తరలించారు. అతడి సెల్‌ఫోన్ ట్రూ కాలర్‌లో సత్యనారాయణ, రైల్వే, దొండపర్తిగా ఉందని, తెలిపారు. వివరాలు తెలిసిన వారు తమను సంప్రతించాలని సీఐ కోరారు.

కాపులుప్పాడలో ఘర్షణ: ఒకరికి తీవ్ర గాయాలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి: ఇద్దరి మధ్య తలెత్తిన వాగ్వాదం ఘర్షణకు దారితీసి, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కాపులుప్పాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి కాపులుప్పాడ రామాలయం వద్ద బైటో భజన జరిగింది. అక్కడికి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గుడ్ల అప్పలకొండ అలియాస్ కళ్యాణ్ వచ్చి భజన చేస్తున్నాడు. అనంతరం మద్యం సేవించిన వేముల రాంబాబు అక్కడకు వచ్చాడు. ఏదో విషయాన్ని ప్రస్తావించి అప్పలకొండను తిట్టాడు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో రాంబాబును అప్పలకొండ జుత్తు పట్టుకుని రోడ్డుకేసి కొట్టాడు. తలకు తీవ్రగాయమవడంతో తొలుత, మారికవలస అక్కడి నుంచి రుషికొండ గీతం ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. అప్పలకొండను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సుధాకర్, ఎస్ఐ గౌరి తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



లక్ష్మీదేవి మృతదేహం

ఆనందపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిందని సీఐ చింతి వాసునాయుడు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి కుంభమేళాకు బయలుదేరిన బస్సు ఈ నెల 23న గండిగుండం జాతీయ రహదారిపై లారీని ఢీకొంది. ఈ సంఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలవడంతో కేజీహెచ్ తరలించారు బళ్లారికి చెందిన లక్ష్మీదేవి (65) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో ఆమె భర్త నారాయణరావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఆరు కిలోల గంజాయి స్వాధీనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు శుక్రవారం తనిఖీ చేస్తుండగా కేరళకు చెందిన ఫవాస్ గంజాయి బ్యాగ్‌లతో పట్టుబడ్డాడన్నారు.

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

» అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జ్ఞానాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. పరీక్షల నిర్వహణపై జ్ఞానాపురం సిల్వర్ జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల శిక్షణలో ఆయన మాట్లాడుతూ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. ఏ విద్యార్థీ నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదని ఆదేశించారు. కేంద్రాల్లో కనీస సదుపాయలను కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లు తీసుకురాకుండా చూడాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, చుట్టుపక్కల జెరాక్స్ షాపులను మూసివేయించాలన్నారు. ప్రశ్న పత్రాలను భద్రపరచడం, పరీక్ష కేంద్రాలకు తరలించడంలో నిర్లక్ష్యం కూడదన్నారు. సమావేశంలో ప్రాంతీయ విద్యాసంచాలకులు జోన్ 1 బి.విజయభాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, ఉపవిద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వరరావు, పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ మురళీమోహన్, డీసీఈబీ కార్యదర్శి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం రేపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏయూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ యోగ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రిటైర్డ్ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందిస్తారన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు.

పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్‌తెలిపారు. విశాఖ-గుణుపూర్ పాసింజర్ రైళ్లకు ఈ నెల ఒకటి నుంచి 31 వరకు స్లీపర్ క్లాసు కోచ్‌ను జత చేశామన్నారు. భువనేశ్వర్-జునాగర్ రోడ్డు ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల ఒకటి నుంచి 31 వరకు, జునాగర్ రోడ్డు- భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల రెండు నుంచి ఏప్రిల్ ఒకటి వరకు స్లీపర్ క్లాసు కోచ్ అందుబాటులో ఉంటుందన్నారు. భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల ఒకటి నుంచి 31 వరకు, జగదల్‌పూర్- భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు (18448) ఈ నెల రెండు నుంచి ఏప్రిల్ ఒకటి వరకు స్లీపర్ క్లాసు జత చేశామని తెలిపారు.

హమాలీ చార్జీలు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాలశాఖకు చెందిన మండలస్థాయి గోడౌన్లలో రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసే హమాలీలకు ప్రభుత్వం చార్జీలు (జీసీసీ హమాలీలతో సహా) పెంచింది. క్వింటాలుకు రూ.25 నుంచి రూ.28 వరకు పెంచుతూ సివిల్ సప్లయిస్ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫీషియో కార్యదర్శి సౌరబ్‌గౌర్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. వీరితోపాటు స్వీపర్లు, స్టిచ్చింగ్ సిబ్బంది, స్వీట్‌పాకెట్, తాగునీటి చార్జీలను పెంచారు. దీనివల్ల సివిల్ సప్లయిస్‌పై ఏడాదికి రూ.11.80 కోట్లు అదనపు భారం పడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మెడ్‌టెక్ జోన్ బిల్లుల క్లియరెన్స్‌కు ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రూ.33.97 కోట్ల విడుదల కోసం అవసరమైన పత్రాలతోపాటు పెండింగ్ బిల్లులను సమర్పించాలని మెడ్‌టెక్ జోన్ ఎండీ, సీఈవోను ఆదేశిస్తూ పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ శుక్రవారం జీవో జారీ చేశారు.

నీతి ఆయోగ్ ప్రగతి చోదకాలపై సమీక్ష

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలోని జిల్లాల ప్రగతి, అభివృద్ధి పనులపై వీఎంఆర్డీఏ, నీతిఆయోగ్ అధికారులు సమీక్షించారు. వీఎంఆర్డీఏ కమిషనర్, నీతి ఆయోగ్ నోడల్ అధికారి కేఎస్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అల్లూరి, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కాకినాడ, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తులో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, మెరుగైన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. నీతి ఆయోగ్ పథక సంచాలకులు పార్థసారథి, విశిష్ట సహచరులు విశ్రాంత ఐఏఎస్ అధికారి కిశోర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్, అల్లూరి, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కాకినాడ, విశాఖ తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు.

సీఐఐ విశాఖ జోన్ చైర్మన్‌గా నారాయణరాజు



నారాయణరాజు



జి.కృష్ణమోహన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) విశాఖపట్నం జోన్ చైర్మన్‌గా డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ నారాయణ రాజు, వైస్ చైర్మన్‌గా ఇన్‌స్పైర్‌ఎడ్జ్ ఎండీ, సీఈఓ జి.కృష్ణమోహన్‌లను నామినేట్ చేశారు. స్థానిక హోటల్‌లో శుక్రవారం జరిగిన సీఐఐ వార్షిక సమావేశంలో రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ వీరి పేర్లను ప్రకటించారు. వీరు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సేవలందిస్తారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వర్ణాంధ్ర విజన్ 2029 సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా కె.విశ్వనాథన్ మాట్లాడుతూ, విశాఖపట్నాన్ని ప్రాంతీయ గ్రోత్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు నీతి ఆయోగ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని, వ్యవసాయం, తయారీ, సర్వీసు రంగాల్లో అనేక మార్పులు రానున్నాయన్నారు. మందుల తయారీలోను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషించనుందన్నారు. పర్యాటక రంగంలో అనేక అవకాశాలున్నాయన్నారు. సుమారు రూ.200 కోట్లతో పీపీపీ విధానంలో ముఖ్యమైన 15 రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ డైరెక్టర్ పార్థసారధిరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అమిత్ మజుందార్, సీఐఐ విశాఖ చైర్మన్ రాజేశ్ గ్రంధి మాట్లాడారు.

హిందుస్థాన్ షిప్‌యార్డుకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న నీలిమా జోష్

మల్కాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)కు రెండు అవార్డులు లభించాయి. ఈ మేరకు శుక్రవారం డిల్లీలో జరిగిన గవర్నెన్స్‌నౌ 11వ పీఎస్‌యూ వేడుకల్లో హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ సముద్ర పరిశ్రమలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు డైరెక్టర్ (స్ట్రాటజిక్ ప్రాజెక్ట్స్) కమడోర్ గిరిదీప్‌సింగ్ ఆపరేషన్స్ లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు. సీనియర్ మేనేజర్ (కార్పొరేట్ ప్లానింగ్) నీలిమా జోష్ కమ్యూనికేషన్ ఔట్‌రీచ్ అవార్డును రాష్ట్ర మంత్రి సతీష్ చంద్రదూబే నుంచి అందుకున్నారు.

'ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు సకాలంలో వేతనాలివ్వాలి'

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతినెలా నిర్దిష్ట సమయానికి వేతనాలు చెల్లించాలని విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. కాంట్రాక్టర్లు ఆర్టీసీకి అందించిన సేవలకు గాను ప్రతి నెలా ఐదో తేదీలోగా బిల్లులను సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెలా పదో తేదీలోగా వేతనాలు చెల్లించాలని సూచించారు. కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించాలని, కార్డులను, బీమా బాండ్లలను వారికి అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ వి.వంశీమోహిని, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్లు, కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ ఉద్యోగులకు శనివారం నుంచి ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) అమలుచేయనున్నారు. ఈ మేరకు ఆదేశాలందాయని అధికారులు వెల్లడించారు. ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులతోపాటు జిల్లాలోని ప్రీ, పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న వార్డెన్లు సుమారు 60 మంది ఉద్యోగులకు ఈ విధానాన్ని అమలుచేయనున్నారు. ప్రస్తుతం ఉద్యోగులు హాజరును మాన్యువల్‌గా నమోదు చేస్తున్నారు. దీనివల్ల ఇబ్బందులు, అవకతవకలకు ఆస్కారం ఉంటోందన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ దిశగా ఆదేశాలు జారీచేసింది. కాగా వసతిగృహాల్లోని విద్యార్థులకు ఇప్పటికే ముఖ హాజరును అమలు చేస్తున్నారు. శనివారం నుంచి హాస్టల్స్‌లో కూడా ఈ విధానాన్ని అమలుచేయనున్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నామని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి, 18నుంచి 40 ఏళ్ల వయసులోపు వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులో శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు కళాశాలలోని స్కిల్ హబ్ కో ఆర్డి నేటర్‌ను 9885694676 నంబరులో సంప్రతించాలన్నారు.